కర్నూలు । నంద్యాల
వార్త

18 మార్చి , 2025 మంగళవారం పేజీలు 4

## చట్టపరంగా న్యాయంపిజిఆర్ఎస్ లో జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్

: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు కార్యక్రమానికి 115 ఫిర్యాదులు.



**కర్నూలు, మార్చి 17 , ప్రభాతవార్త :**
కర్నూల్ కొత్తపేటలోని కర్నూల్ టూ టౌన్ పోలీస్ స్టేషన్ ప్రక్కన ఉన్న ఎస్పీ క్యాంపు కార్యాలయంలో కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం కు వచ్చిన ప్రజల సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాది దారులతో జిల్లా ఎస్పీ గారు మాట్లాడి వారి యొక్క సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఈ రోజు మొత్తం 115 ఫిర్యాదులు వచ్చాయి. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఈ సంధర్భంగా కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ హామీ ఇచ్చారు. ఈ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ హుస్సేన్ పీరా, సిఐలు పాల్గొన్నారు.

# ఉరకలు..పరుగులు..పరీక్షలు..!

- పదో తరగతి పరీక్షలకు ఉత్సాహంగా హాజరైన విద్యార్థులు..
- మాస్ కాపీంగ్‌కు పాల్పడితే బాధ్యులపై వేటు..
- పకడ్బందీగా పరీక్షల నిర్వహణ..



**ఉరుకలు..పరుగుల మధ్య పదో తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి.. జిల్లాలో పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి.. పరీక్ష కేంద్రాలకు 45 నిమిషాలు ముందుగానే విద్యార్థులు చేరుకోవాలంటూ విద్యాశాఖ ఆదేశాలు జారీ చేయడంతో ఉరకలు, పరుగులతో విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు తరలివచ్చారు..తొలిరోజు తెలుగు పరీక్ష పేపర్‌కు 98 శాతం మంది విద్యార్థులు హాజరైనట్లు జిల్లా విద్యాధికారుల సమాచారం.. సమయం మించిపోతోందనే ఆందోళనతో విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు పరుగులు తీసారు..సకాలంలో కేంద్రంలో చేరేంత వరకు భయాందోళనలతో ఉన్నారు.. సకాలంలో చేరుకోవడంతో హమ్మయ్య అంటూ పరీక్షల కేంద్రంలో విద్యార్థులు నిట్టూర్పు విడిచారు..**

**కోసిగి, మార్చి 17, ప్రభాతవార్త :**
కేంద్రాల వద్ద కోలాహలం:
విద్యా సంవత్సరం అనంతరం పగడ్బందిగా కేవలం ఆరు పేపర్లతో జరుగుతున్న పదో తరగతి పరీక్షలు అట్టహాసంగా మొదలయ్యాయి.. దీంతో విద్యార్థులు కామన్‌గా పరీక్షలు రాస్తుండడంతో సోమవారం పెద్ద ఎత్తున కోలాహలం చోటుచేసుకుంది.. పరీక్షల్లో పాటించాల్సిన సూచనలు, ఎవరి సహాయం తీసుకోవాలనే అంశాలపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సూచనలు చేసారు..సాధారణ పరీక్షలు అనగానే విద్యార్థుల చేతుల్లో పెద్ద ఎత్తున పుస్తకాలు, స్టడీ మెటీరియల్ ఉండడం సహజం..అయితే ఈ సారి ఏ కేంద్రం వద్ద విద్యార్థుల చేతుల్లో అటువంటి మెటీరియల్ కనిపించలేదు..తల్లిదండ్రులు ప్రార్థనా స్థలాలకు తమ పిల్లలను తీసుకెళ్లి పూజారులతో, దైవ జనులతో ఆశీర్వాదించి పంపించారు. కాగా జిల్లాలోని కొన్ని సెంటర్లలో మాత్రం చిన్న చిన్న సమస్యలు వెలుగు చూసాయి.. పరీక్ష కేంద్రాల్లో రూమ్ నెంబర్లను స్పష్టంగా పేర్కొనకపోవడం, బయట బోర్డులపై రూమ్‌ల మ్యాపింగ్ లేక పోవడం, సరైన డైరెక్షన్‌లు లేకపోవడంతో విద్యార్థులు స్వల్పంగా ఇబ్బందులు పడ్డారు.. గత సంవత్సరం మాదిరిగానే పాత పద్దతిలో పరీక్షలు రాస్తుండడంతో విద్యార్థులు కాస్తా తికమక పడ్డారు.. దీనికి తోడు ఈ సారి కూడా పదో తరగతిలో సరైన సిలబస్ పూర్తికాకపోవడంతో పాటు చాలా జాప్యం వల్ల చదువు పట్ల విద్యార్థులు అనాసక్తి చూపించినట్లు తెలుస్తోంది..ఈ నేపథ్యంలో తరగతి గదుల్లోకి ఎలా వెళ్లాలో తెలియక, హాల్‌టికెట్‌లో ఉండే నెంబరును చూడడం కోసం కాస్తా ఇబ్బంది పడ్డారు.. ఏది ఏమైనప్పటికి మొదటి పరీక్షను సంపూర్తి చేసారు.. కోసిగిలో ఏర్పాటు చేసిన నాలుగు పరీక్షా కేంద్రాలలో దాదాపు 910 మంది విద్యార్థులుకు గాను 32 మంది విద్యార్థులు గైర్హాజర్ అయినట్లు పరీక్షల నిర్వహకులు తెలిపారు.

• వివరాలు 2లో

# సిఎంఓ నుండి వచ్చిన అర్జీలను.. వెంటనే పరిష్కరించండి

**: రెవెన్యూ సదస్సుల అర్జీలను పరిష్కరించండి
జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా**



**కర్నూలు, మార్చి 17, ప్రభాతవార్త :**
సిఎం కార్యాలయం నుండి వచ్చిన అర్జీల పరిష్కారంలో జాప్యం చేయకూడదని, పెండింగ్ లో ఉన్న అర్జీలను వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్ పిజిఆర్ఎస్) కార్యక్రమం ద్వారా కలెక్టర్ ప్రజల నుండి వినతులను స్వీకరించారు. ఫిర్యాదుల స్వీకరణ అనంతరం కలెక్టర్ ఫిర్యాదుల పరిష్కారంపై అధికారులతో సమీక్షించారు.. పత్తికొండ ఆర్డీఓకు సంబంధించి 10, సబ్ కలెక్టర్ ఆదోని కి సంబంధించి 16, కర్నూలు ఆర్డీఓకు సంబంధించి 15, డిఎస్ఓకు సంబంధించి 3, ఎడి సర్వే కు సంబంధించి 2, డీఆర్డిఎ పిడి కు సంబంధించి 2, జిల్లా పరిషత్ సీఈఓ, డిఎంహెచ్ఓ, డి పి ఓ, గిరిజన సంక్షేమ శాఖ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్,, జిల్లా రిజిస్ట్రార్, హౌసింగ్ పిడి లకు సంబంధించి ఒక్కొక్క దరఖాస్తు పెండింగ్ లో ఉన్నాయని, వెంటనే వీటిని పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు..రెవెన్యూ శాఖ లో ఎక్కువగా పెండింగ్ ఉన్నాయని, పరిష్కారంపై శ్రద్ధ చూపాలని, జాప్యం చేయకూడదని కలెక్టర్ ఆదోని సబ్ కలెక్టర్, ఆర్డీవో లను ఆదేశించారు..ఈ అంశంపై సంబంధిత అధికారులతో మాట్లాడి, వేగంగా పరిష్కరించే విధంగా దృష్టి సారించాలని కలెక్టర్ డిఆర్ఓ ను ఆదేశించారు. రెవెన్యూ సదస్సుల అర్జీల పరిష్కారం పూర్తి కావాలని కలెక్టర్ తహసీల్దార్ లను ఆదేశించారు..రెవెన్యూ సదస్సులలో వచ్చిన అర్జీలకు సంబంధించి కృష్ణగిరి తహసిల్దార్ వద్ద 43, కర్నూలు ఆర్డీఓ వద్ద 37, పత్తికొండ ఆర్డిఓ వద్ద 12, మద్దికెర తహసిల్దార్ వద్ద 11, ఓర్వకల్లు తహసిల్దార్ వద్ద 9 అర్జీలు పెండింగ్ లో ఉన్నాయని, అలాగే మిగిలిన మండలాల్లో కూడా సింగిల్ డిజిట్ లో పెండింగ్ ఉన్నాయని, వాటిని త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తహశీల్దార్లను ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డిఆర్ఓ సి.వెంకట నారాయణమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బికె.వెంకటేశ్వర్లు, జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అమ్మా నాన్న..ఎప్పుడు వస్తాడు..!

**తండ్రికి ప్రమాదం జరిగిన సంఘటన తెలిస్తే ఆ చిన్నారులు భయపడతారని ఉద్దేశంతో గత ఐదు రోజులుగా నాన్నకు ఆరోగ్యం బాగాలేదని చికిత్స పొందుతున్నాడని ఈరోజు వస్తాడు రేపు వస్తాడు అని చెబుతూనే వచ్చేవాళ్ళు చివరకు ఈరోజు ఆ చిన్నారులకు ఇక నాన్న రాడని చెప్పడంతో ఆ చిన్నారులు కన్నీరు మున్నీరు అయ్యారు.**





**ఆదోని రూరల్ మార్చి 17 ప్రభాతవార్త:**
సోమవారం ఉదయం మండల పరిధిలోని నాగలాపురం గ్రామానికి చెందిన సుగురు వీరేష్( 30) అనే వ్యక్తి గత వారంలో గురువారం రోజున ఎమ్మిగనూరు నుంచి ట్రాక్టర్ పై స్వగ్రామానికి వస్తుండగా కోటేకల్ ఆరెకల మధ్యలో ట్రాక్టర్ కారు ఢీకొన్న సంగతి తెలిసింది అయితే ఈ ప్రమాదంలో వీరేష్ అనే వ్యక్తికి చికిత్స నిమిత్తం ఏరియా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా మళ్లీ అక్కడ నుంచి మధు హాస్పిటల్ తరలించారు పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలపడంతో మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు రిఫర్ చేశారు. ఐదు రోజులుగా చికిత్స పొందుతూ సోమవారం ఉదయం చనిపోయినట్లు వైద్యులు తెలిపారు మృత్యువుతో ఐదు రోజులు పాటుగా మృతితో పోరాడి సోమవారం చనిపోవడం జరిగింది మృతుడికి భార్య సుజాత ఐదు మంది కుమార్తెలు ఉన్నారు. మృతుడికి సాయం చేయాలని కుటుంబ సభ్యులు మృతదేహంతో హోటల్ ముందు నిరసన చేయగా మృతుడు కుటుంబానికి వాహనదారులు మానవత్వ దృక్పథంతో ఆర్థిక సాయం చేస్తామని హామీ ఇచ్చారు

## తొలగించేది.. ఇంకెప్పుడు



**ఆలూరు రూరల్, మార్చి17, ప్రభాతవార్త:**
ఆలూరు పట్టణంలోని బస్టాండ్ సమీపంలో గత పదహేను రోజుల నుండి చెత్త తొలగించకపోవడంతో స్థానికులు మరియు ప్రయాణీకులు ఇబ్బంది పడుతున్నారు. పట్టణంలో ప్రధానంగా ఆ రహదారిలో పని మీద వెళ్లే ప్రజలు, స్కూల్‌కు వెళ్లే విద్యార్థులతోపాటు ఆ కంపును భరించలేకపోతున్నారని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాక అక్కడ ఉండేటటువంటి హోటల్స్, కూరగాయల షాప్‌లు మరియు పండ్ల వ్యాపారస్తులు చెత్తను తెచ్చి అక్కడ వేయడంతో దుర్వాసన వస్తుందని అక్కడ ఉండే దుకాణదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే గతంలో ఇక్కడ చెత్త కుండీ ఉండేదని దాన్ని అధికారులు తొలగించడంతో ఆ చెత్తను షాప్‌ల వెనుకభాగంలో వేస్తుండడంతో దాని ద్వారా వచ్చే దుర్వాసన భరించలేకుండా ఉన్నామని వ్యాపారస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఇంత చెత్త పేరుకుపోవడాన్ని పంచాయతీ అధికారులు గమనించారో లేదోగాని మరీ ఇంత చెత్తను తొలగించి అక్కడ డస్ట్‌బిన్ ఏర్పాటు చేస్తారో లేదో వేచి చూడాలి మరి.

# పిజిఆర్ఎస్‌లో నేటివరకు 27,854 ఫిర్యాదులు పరిష్కారం

**- పిజిఆర్ఎస్ ఫిర్యాదుల పరిష్కారంపై ప్రజాభిప్రాయాన్ని సేకరించండి : జిల్లా కలెక్టరు రాజకుమారి**

**నంద్యాల, మార్చి 17, ప్రభాతవార్త ప్రతినిధి :**
ప్రజాసమస్యల పరిష్కారవేదిక ద్వారా నేటివరకు 30,058 దరఖాస్తులకు గాను 27,854 ఫిర్యాదులను పరిష్కరించామని, ఈ మేరకు సంబంధిత అర్జీదారుల అభిప్రాయాలు సేకరించాలని జిల్లా కలెక్టరు జి.రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో జిల్లా నలుమూల నుంచి వచ్చిన ప్రజల ఫిర్యాదులను స్వీకరించారు. జిల్లాకలెక్టరు+తో పాటు జాయింటుకలెక్టరు విష్ణుచరణ్, డిఆర్ రాముానాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న 2,157 దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించి సకాలంలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. గ్రామ వార్డు సచివాలయాల ద్వారా చేపట్టిన సర్వే వివరాలు సేకరించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న 5,444మిస్సింగ్ సిటిజన్ డేటా, 195మంది ఎంప్లాయిస్ డేటా, 14,141 హౌస్ హోల్డ్‌జియోట్యాగింగ్ డేటా, నందికొట్కూరు, ఆత్మకూరు, ఆళ్లగడ్డ, డోన్ పట్టణ ప్రాంతాల్లోని ఎంఎస్ఎంఇ, పి4 తదితర పెండింగ్ సర్వేలన్నింటిని త్వరితగతిన పూర్తిచేసేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని మున్సిపల్ కమీషనర్లు, డిఎల్‌డిఓలు, ఎంపిడిఓలను కలెక్టరు ఆదేశించారు. సమస్యలను సరైన రీతిలో పరిష్కరించకుండ ఫిర్యాదులను ఎట్టిపరిస్థితుల్లోను ముగించరాదని కలెక్టరు స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో విచారించి పరిష్కరించిన ఫోటోలను అప్‌లోడ్ చేయాలన్నారు. ఫిర్యాదుదారులు సంతృప్తి చెందేలా ఎండార్స్ ఇవ్వాలని కలెక్టరు ఆదేశించారు. ఇదిలా ఉండగా పిజిఆర్ఎస్ ద్వారా స్వీకరించిన వాటిలో బేతంచర్ల మండలం బైలుపేటకు చెందిన ఫైజున్‌బీ ప్రభుత్వం గృహం మంజూరు చేయాలని దరఖాస్తు చేసుకున్నారు. నందికొటూ ౭రు మండలం దామగట్ల గ్రామంలో బిఎస్ఎన్ఎల్ టవరు నిర్మించేందుకు వస్తే గ్రామస్తులు అడ్డుకోగా, మళ్లీ సెల్‌టవర్ నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్న నేపథ్యంలో గ్రామంలోని ప్రజలు అనారోగ్యానికి గురవుతారని సెల్‌టవర్‌నిర్మాణాన్ని ఆపాలని గ్రామస్తులు కలెక్టరుకు విన్నవించారు. మండకేంద్రమైన ఆళ్లగడ్డకు చెందిన మహేశ్వరమ్మ తన భర్త ప్రమాదంలో మరణించి ఐదు సంవత్సరాలు గడిచినా వితంతు పెన్షన్ మంజూరు కాలేదని కలెక్టరుకు దరఖాస్తు అందజేశారు. ఈ కార్యక్రమంలో 209మంది అర్జీదారులు తమ సమస్యల పరిష్కారానికి కలెక్టరుకు అర్జీలు సమర్పించారు. సకాలంలో అర్జీలకు పరిష్కారాన్ని సూచించాలని సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ కలెక్టరు ఆదేశాలు జారీచేశారు.



## శ్రీశైల మల్లన్నను దర్శించుకున్న తెలంగాణా ప్రముఖులు



**శ్రీశైలంప్రాజెక్టు, మార్చి17, ప్రభాతవార్త**
అష్టధశ శక్తిపీఠం ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైలం మహాపుణ్యక్షేత్రంను సోమవారంనాడు తెలంగాణా ప్రముఖులు మాజీ ఏంఎల్‌సి, జిల్లాపరిషత్ చైర్మన్ కాసీని జ్ఞానేశ్వర్, ఉమ్మడి రాష్ట్రాల మార్కెట్ చైర్మన్, ఐటి డైరక్టర్, ముప్పిడి గోపాల్, అల్‌ఇండియా పిషర్‌మ్యాన్ చైర్మన్ చిన్నాజి వేంకటేశ ం, తదితరులు శ్రీస్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు. ఈక్రమంలోనే వారు శ్రీస్వామి అమ్మ వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తదుపరి ఆలయ అమ్మవారి అలం కార మండపంలో వేదపండితులు వేధాశీర్వచనములు వల్లించగా అర్చకస్వాములు తీర్ధప్రసాదాలను అందజేసారు. తదుపరి ఆలయ అధికారులు శ్రీస్వామివారి శేషవస్త్రములతో సత్కరించి లడ్డు ప్రసాదాలను అందజేసారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ శ్రీశైలదేవస్థానంలో కాసాని చంద్రకళ, జ్ఞానేశ్వర్ నిలయం అను విఐపి కాటేజిని నిర్మించి పూర్తి కావడంతో ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని తెలిపారు. అదే విధంగా ప్రారంభోత్సవం సందర్బంగా అతిధి వసతి గృహంను శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించడం జరిగిందని అన్నారు. అ శ్రీశైల మల్లన్న సన్నిదికి చేరుకోని వారిని దర్శించుకోవడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. అ స్వామిఅమ్మవార్ల కృప ఎల్లప్పుడు మెండుగా ఉండాలని రెండు తెలుగు రాష్ట్రాలు సుబిక్షంగా ఉండాలని శ్రీస్వామిఅమ్మవార్లను కోరుకోవడం జరిగిందని తెలిపారు.



# పైస్థాయి అధికారులతో.. కింది స్థాయి ఉద్యోగి.. ఢీ..అంటే..ఢీ..!

- చెయ్యి .. తడిపితేనే పొలం తడుపుతా..!
- ఇరిగేషన్ శాఖలో వర్కఇన్‌స్పెక్టర్ జబర్దస్త్
- భారీ ఎత్తున జలచౌర్యం
- నిజా నిజాలు తేలిన వెంటనే శాఖా పరమైన చర్యలు : ఇ.ఇ పాండురంగయ్య



**కోడుమూరు, మార్చి 17, ప్రభాతవార్త :**
కోడుమూరు నీటి పారుదల శాఖలో పని చేస్తున్నా ఓ .. కింది స్థాయి ఉద్యోగి పై స్థాయి అధికారులతో ఢీ అంటే ఢీ అనే రీతిలో వ్యవహారిస్తున్నడం గమనార్హం. తనకు కూటమి పార్టీ నేత అండదండలున్నాయని నమ్మబలుకుతూ ఇరిగేషన్ శాఖల్లో పని చేసే డి.ఇ, ఎ.ఇ స్థాయి అధికారులను లెక్క చేయడం లేదనే విషయాలు సర్వత్రావ్యక్తం అవుతున్నాయి. దీంతో ఆ చోటా స్థాయి ఉద్యోగి భారీ ఎత్తున జలచౌర్యానికి పాల్పడుతున్నారన్న ఆరోపణలున్నాయి. ఈ ఆరోపణలపై ఇరిగేషన్ అధికారులంతా ఇప్పటికే పలుమారులు జలచౌర్యంపై సమగ్ర విచారణ చేపట్టి .. ఈ నివేదికలను ఉన్నత స్థాయి అధికారుల దృష్టికి తీసుకుపోయిన సందర్భాలు ఉన్నాయి. అంతే గాక సాగు నీటిని అందించేందుకు రైతుల దగ్గర డబ్బులు వసూలు చేసిన వారిపై ఇది వరకే కోడుమూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదులు కూడా చేశారు. ఆ నివేదికల ఆధారంగా ఇంత వరకు ఆ అవినీతి వర్క్‌ఇన్‌స్పెక్టర్‌పై శాఖా పరమైన చర్యలు తీసుకునేందుకు కూడా వెనకముందు ఆలోచించే పరిస్థితులు ఏర్పడడడం శోచనీయం. ఇక తాను ఎవ్వరినీ లెక్కచేసేది లేదనే దోరణితో అడ్డుఅదుపు ల్లేకుండా ఇటు ఆయకట్టు, అటు నాన్ ఆయకట్టు రైతులతో డైరెక్టుగా భేర సారాలాడి సాగు నీటిని పక్కదారి పట్టిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ దందాను నడిపించేందుకు అదే శాఖలో పనిచేసే లస్కర్లను, కావలిదారులను ఎరేసుకొని వారి సహాయంతో చెయ్యి తడిపిన రైతు పొలాలకు సాగు నీరందిస్తున్నారనే విషయాలు వెలుగులోకి వచ్చిన విషయం తెలసిందే. ఆ .. స్థాయి అధికారి నడిపిస్తున్న దందాకు ఇక్కడి అధికారుల్వెరూ అడ్డుకట్ట వేయలేక పోతున్నడం కొసమెరుపు. ఈ నెలాఖరి వరకు సాగు నీటి సరఫరా అవుతున్నడంతో ఈ సీజన్ కింద సాగు చేసుకున్న రైతులు సాగు నీటి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీంతో సాగు నీటి అవసరం పెరగడంతో కొంత మంది రాజకీయ పలుకుబడి ఉన్న వారి అనుచరులతో తుంగభద్ర దిగువ కాలువ కోడుమూరు సబ్‌డివిజన్‌లోని కెబిసి డైవైడర్ దగ్గర 1 ఎల్ కాలువ తూములను పగులగొట్టి సాగు నీటిని తీసుకుపోతున్నా అడిగే వారు లేక పోవడం శోచనీయం. ఇలా తూములు పగులగొట్టి సాగు నీటిని తీసుకుపోతే తమ పరిస్థితి ఏంటని 8 ఎల్ తూము కింద ఉన్న రైతులు ఇక్కడున్న నీటి పారుదల శాఖ అధికారులను ప్రశ్నిస్తున్నారు.

**కూటమి నేతలకు రైతుల గోడును విన్నవిస్తాం :** కోడుమూరు ఇరిగేషన్ శాఖలో పనిచేస్తున్న కింద స్థాయి ఉద్యోగి తనకు కూటమి నేతల అండదండలున్నాయనే సాకుతో జలచౌర్యానికి పాల్పడుతున్న ఆ ఉద్యోగి చేస్తున్న అవినీతిపై తామే కూటమి నేతలను కలిసి ఇక్కడ జరిగే జలచౌర్యం గురించి విన్నవిస్తామని రైతులు తెలిపారు. రాష్ట్రంలో ఎక్కడా కూడా రైతులకందించే సాగు నీటిపై జలచౌర్యానికి పాల్పడకూడదని కూటమి ప్రభుత్వం తీవ్ర స్థాయిలో హెచ్చరికలు జారి చేసిన విషయం తెలిసిందే. అయితే ఇక్కడ మాత్రం కూటమి నేతల పేర్లను ఉపయోగిస్తూ కూటమి ప్రభుత్వ నిబంధనలను గాలికొదిలేసి భారీ ఎత్తున జలచౌర్యానికి పాల్పడడం ఎంతవరకు సమంజసం.

**నిజ నిజాలు తేలిన వెంటనే చర్యలు తీసుకుంటాం :** తుంగ భద్ర దిగువ కాలువ కోడుమూరు సబ్‌డివిజన్‌లో జల చౌర్యానికి పాల్పడుతున్నట్లు వచ్చిన ఆరోపణలపై చేపట్టిన విచారణలో నిజ నిజాలు తెలిసిన వెంటనే వర్క్ ఇన్‌స్పెక్టర్‌పై శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని ఇరిగేషన్ ఇ.ఇ పాండురంగయ్య అన్నారు. సోమవారం ఆయన దిగువ కాలువలోని కెబిసి డ్యాం దగ్గర ఉన్న తూమును పగులగొట్టిన ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ తూమును పగులగొట్టిన వారిపై వెంటనే గూడూరు పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదు చేయాలని స్థానిక ఇరిగేషన్ ఎ.ఇ మోహన్‌రావుకు ఆదేశాలిచ్చామని తెలిపారు.

## ఘనంగా సరస్వతి పూజ చేశారు పరీక్షల్లో బెంచులు మరిచారు

**: అధికారుల నిర్లక్ష్యంతో బెంచీలు లేక నేలపై పరీక్షలు**



**హులగుంద మార్చి 17 ప్రభాతవార్త :**
పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ఈ నెల 17 నుంచి అనగా సోమవారం నుంచి ఆరంభం అయ్యాయి. మండలకేంద్రం వ్యాప్తంగా హోలగుంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఏ మరియు బి సెంటర్లు, స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, కస్తూర్బా గాంధీ పాఠశాల సెంటర్లుగా మొత్తం4 పరీక్షా కేంద్రాల్లో 606 మంది విద్యార్థులు పరీక్షలు రాయడానికి ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశామని చెప్పుకొచ్చారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకూ పరీక్షలు నిర్వహిస్తారు. ఏప్రిల్ 1 వరకూ పరీక్షలు జరుగుతాయి. అయితే ఈసారి ఏర్పాట్లలో లోపాలు కనిపిస్తున్నాయి. ఏ ఒక్క విద్యార్థి నేలపై కూర్చొని పరీక్షలు రాయకూడదని, ఒక బెంచీకి ఒక విద్యార్థి మాత్రమే ఉండాలి అని జిల్లా విద్యాశాఖ అధికారి కలెక్టర్ నిర్దేశాలున్నా... ఇద్దరు విద్యార్థులకు ఒక బెంచీ చొప్పున ఏర్పాటు చేశామని స్తానిక అధికారులు తెలిపారు. ప్రతి గదిలో 24 మంది విద్యార్థులు మాత్రమే ఉండాలి. 24 బెంచీలు ఏర్పాటు చేయాలి. 24 బెంచీలు ఏర్పాటు చేయడం సాధ్యం కాలేదంటున్న అధికారులు అక్కడక్కడా పరీక్ష హాల్లో ముగ్గురు విద్యార్థులకు రెండు బెంచీలు అమర్చారు. రెండు బెంచీలను కలిపారు. మరికొన్నిచోట్ల ఒక బెంచీకి ఇద్దరు విద్యార్థులు కూర్చొనేలా నంబర్లు అమర్చారు. అరకొర ఏర్పాట్లతో ప్రారంభమైన పది పరీక్షలు పలు కేంద్రాల్లో లైట్లు, ఫ్యాన్లు కూడా అంతంత మాత్రంగానే ఉన్నాయి. అంతేకాకుండా పూర్తిగా రెండు పరీక్షా కేంద్రాల్లో అయితే అసలు బెంచీలే లేకుండా విద్యార్థులు నేల మీద కూర్చుని పరీక్షలు రాయడం జిల్లా మొత్తంగా సోషల్ మీడియాలో విషయం చక్కర్లు కొట్టింది. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు 10 పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై అధికారుల తీరుపై మండిపడుతున్నారు. జిల్లా ఉన్నతాధికారులు గత నెల నుండి పరీక్షల కోసం ఎన్నో ఏర్పాట్లను చేసి పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా చర్యలు చేపట్టాలని సూచించిన స్థానిక అధికారులు మాత్రం ఉన్నతాధికారుల ఆదేశాలను పట్టించుకోకపోవడం వారి నిద్రావస్తకు నిదర్శనంగా మారిందని, విద్యార్థుల తల్లిదండ్రులు అటు విద్యార్థి సంఘాలు అధికారుల తీరుపై మండిపడుతున్నారు. అంతేకాకుండా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం నిర్లక్ష్యంతోనే ప్రస్తుతం విద్యార్థులు నేలపై పది పరీక్షలు రాయాల్సి వస్తుందని మరికొంతమంది హెచ్ ఎం తీరుపై ఆరోపణలు వెలిబుచ్చారు.

# ప్రసవ "వేదన"..

: ప్రసవంలో ప్రపంచాన్ని వీడిన ఉపాధ్యాయుని..
: కష్ట కాన్పుతో మృతి చెందిన కోసిగి మహిళా టీచర్..
: సంతాపం తెలిపిన ఎంఈవోలు, కోసిగి ఉపాధ్యాయ బృందం..

**కోసిగి, మార్చి 17, ప్రభాతవార్త**



పురుడు దేవుడిచ్చిన వరం..అంతేకాక ఇది స్త్రీకి మరోజన్మలాంటిది.. ఇలాంటి పురుడు కోసి జన్మజన్మలుగా ఆ మహిళ ఎదురు చూస్తోంది.. ఎన్నో కలలు కంటుంది. తాను తల్లి అవుతున్నందుకు దేవున్ని మనస్సులో ప్రార్థించింది..తాను తల్లిని కాబోతున్నందుకు పలువురితో తన సంతోషాన్ని పంచుకుంది..ఇక నెలలు నిండాయి పురుడు కోసం ఆసుపత్రికి వెళ్లింది..ప్రసవ వేదన పడింది..కానీ దేవుడు కనికరించలేదు.. ప్రసవంలో ప్రపంచాన్ని వీడిన ఓ మహిళాటీచర్ సంఘటన సోమవారం చోటు చేసుకుంది.. కోసిగిలోని సీజీ ప్రాథమిక పాఠశాలలో కవిత అనే ఉపాధ్యాయురాలు గత 8 సంవత్సరాలుగా విధులునిర్వహిస్తుంది..బనగానిపల్లె మండలం రామకృష్ణాపురం గ్రామానికి చెందిన ఈ మహిళా ఉపాధ్యాయురాలు ఆత్మకూరు మండలం భానుముక్కల గ్రామానికిచెందిన వ్యక్తితో గత రెండు సంవత్సరాల క్రితం వివాహం అయింది.. దేవుడు వీరి కుటుంబాన్ని ఆదరించడంతో మహిళా టీచర్ గర్భవతి అయింది..ఈవిషయాన్ని పలువురితో పంచుకుంది.. తాను తల్లిని కాబోతున్నానని తన తోటి సహ మహిళా టీచర్లతో పంచుకుంది..తీర పురుడు పోసుకునే సమయంఆసన్నమయింది.. దీంతో ఆత్మకూరులోని ఆసుపత్రికి తీసుకెళ్లారు.. అందరూ కూడా సుఖమైన కాన్పు అవుతుందని ఆశ పడ్డారు.. కాని కాన్పు కష్టతరమైంది..ఆ మహిళా టీచర్ ప్రసవ వేదన పడింది.. ప్రసవం కాస్త క్లిష్టతరంగా మారడంతో ప్రసవంలోనే ఈ మహిళా టీచర్ ప్రపంచాన్ని వీడింది..ఎన్నో కన్న కలలు శూన్యమయ్యాయి..తాను ఒకటి తలిచితే దైవం మరొకటి తలిచినట్లైయింది..కవితా మేడం తిరిగిరాని లోకాలు వెళ్లిన సంఘటన కోసిగిలో గుప్పుమంది.మండలంలోని ఉపాధ్యాయులందరూ బోరునా విలపించారు.. తమతో పాటు కలసి పని చేస్తున్న కవితా మేడం ఒక్కసారిగా లేకపోవడంతో చాలామందిఉపాధ్యాయురాళ్లు జీర్ణించుకోలేక పోయారు..ఈ సందర్భంగా కోసిగి ఎంఈవోలు మొయినుద్దిన్, శోభారాణిలతోపాటు కోసిగి ఉపాధ్యాయ బృందం ప్రగాఢసంతాపాన్ని వ్యక్తం చేసింది.. అలాగే ఏపిటిఎఫ్ శాఖ కూడా సంతాపాన్ని ప్రకటించింది..అంతేకాక మృతి చెందిన కవితా టీచర్ గ్రామానికి కోసిగి ఉపాధ్యాయులు వెళ్లి అంత్యక్రియల్లో పాల్గొన్నారు..

## ఉరకలు..పరుగులు..పరీక్షలు..!

**(మొదటి పేజీ తరువాయి ) :** బాలుర ఉన్నత పాఠశాలలో ఏ సెంటర్‌లో 6 మంది, బి సెంటర్‌లో 6 మంది, మౌంట్‌కార్మెల్ స్కూల్‌లో 10 మంది, జెడ్‌పిహైస్కూల్ బాలికల ఉన్నత పాఠశాలలో 10 మంది గైర్హాజర్ అయ్యారు.. .. దీంతో మొత్తం పరీక్షకు 32 మంది విద్యార్థులు హాజరు కాలేదని చెప్పారు..నాలుగు కేంద్రాలలో ఏర్పాటు చేసిన మౌలిక సదుపాయాలపై అధికారులు సంతృప్తిని వ్యక్తం చేసారు. పరీక్షల కేంద్రాల వద్ద ఎస్ఐ చంద్రమోహన్ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేయడంతోపాటు ఎక్కడా మాస్ కాపీయింగ్‌కు చోటు ఇవ్వలేదు.. గతంలో జరిగిన విధంగా కేసులు నమోదు అవుతాయని అందరు జాగ్రత్త పడ్డారు.. అంతేకాక విద్యార్థులు పరీక్షలు ప్రశాంతంగా రాసేందుకు ఎలాంటి శబ్ద కాలుష్యం లేకుండ చేయడం జరిగింది..

**బస్సు రవాణా సౌకర్యం:** పదో తరగతి పరీక్షలను రాసేందుకు వెళ్తున్న విద్యార్థులకు ప్రభుత్వం బస్సు రవాణా సౌకర్యాన్ని కల్పించింది.. పరీక్ష కేంద్రాలకు వెళ్లే పదో తరగతి విద్యార్థులు బస్సులో హాల్ టిక్కెట్ చూపిస్తే వారికి పరీక్ష కేంద్రం వరకు ఉచితంగా ప్రయాణించేందుకు రవాణా శాఖ సదుపాయం కల్పించింది..

## హైదరాబాదులో ఉండి హోళగుంద రాజకీయం చేస్తే సహించబోము

: వైకాపా పార్టీలో నాయకులను తెదేపా పార్టీలో చేర్చుకుంటే సహించే ప్రసక్తే లేదు..

**హోళగుంద మార్చి 17, ప్రభాతవార్త :** హైదరాబాదులో ఉండి హోళగుంద రాజకీయం చేస్తే సహించబోమనీ వైకాపా పార్టీలో నాయకులను తెదేపా పార్టీలో చేర్చుకుంటే సహించే ప్రసక్తే లేదు..కూటమి నాయకులు అన్నారు ఈ సందర్భంగా సోమవారం తెలుగుదేశం పార్టీ కార్యకర్తలతో మాట్లాడితూ గెలుపు కోసం కష్టపడిన కార్యకర్తలను గుర్తించండి... వైసిపి నాయకులకు ఏ స్థాయిలో పనిచేసిన ఊరుకోము... కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు కూటమి ప్రభుత్వాన్ని అధికారంలోకి తేవడానికి కష్టపడిన ప్రతి కార్యకర్తలను గుర్తించాలని వైఎస్ఆర్సిపి నాయకులను పార్టీలో చేర్చుకుంటామంటే ఒప్పుకోము అని కూటమి పార్టీల నాయకులు కార్యకర్తలు అన్నారు. కూటమి పార్టీల నాయకులు కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. హోళగుంద మండల కేంద్రం నందు కూటమి పార్టీల నాయకుల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ డాక్టర్ తిప్పయ్య, జనసేన కన్వీనర్ అశోక్, తెలుగుదేశం పార్టీ మాజీ మండల కన్వీనర్ వీరన్న గౌడ్ మాట్లాడుతూ మండలంలో కూటమి అధికారం కోసం అహర్నిశలు కష్టపడిన కార్యకర్తలను గుర్తించడం లేదని వైఎస్ఆర్సిపి నాయకుల కోసం పనిచేస్తున్నారు కానీ కూటమి అధికారం కోసం కృషిచేసిన కార్యకర్తలను పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్ లో ఉండే వ్యక్తులు ఇక్కడ రాజకీయం చేస్తామంటే కుదరదని, స్థానిక నాయకులు కార్యకర్తలతో చర్చించి పార్టీ కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. ఇప్పటికైనా కూటమి అధికారం కోసం పనిచేసిన నాయకులను కార్యకర్తలను గుర్తించి ఏ పార్టీ కార్యక్రమమైన అందరితో చర్చించి నిర్ణయించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## హోరాహోరీగా పంచాయతీ వేలం పాటలు

: 11.48 లక్షలతో నడిగడ్డ నాగేంద్ర కైవసం : పంచాయతీకి 3.7 లక్ష లఆదాయం

**ప్యాపిలి మార్చి17ప్రభాతవార్త:**

ప్యాపిలి మేజర్ పంచాయతీ పరిధిలో వారపుసంత, కూరగాయల మార్కెట్, బస్టాండు, మాంసపు మార్కెట్లకు సోమవారం సర్పంచ్ లక్ష్మీదేవి, ఉపసర్పంచ్ గడ్డం భువనేశ్వర్ రెడ్డి, ఈవోఆర్డి బాలకృష్ణుడు, ఈవో శివకుమార్ గౌడ్ ఆధ్వర్యంలో వేలంపాటలను నిర్వహించారు. వేలం పాటలు సర్కారీ పాట తొమ్మిది లక్షల తొమ్మిది వేల రూపాయలతో మొదలై హోరాహోరీగా జరిగాయి. ప్యాపిలి పట్టణానికి చెందిన నడిగడ్డ నాగేంద్ర రికార్డు స్థాయిలో 11 లక్షల 48 వేల రూపాయలకు వేలంపాటలో దక్కించుకున్నారు. ఈ సందర్భంగా ఈఓఆర్డి బాల కృష్ణుడు, ఈవో శివకుమార్ గౌడ్ మాట్లాడుతూ గ్రామపంచాయతీ వేలం పాటలు ప్రశాంత వాతావరణంలో జరిగాయని తెలిపారు. గత సంవత్సరం వేలం పాటల ద్వారా తొమ్మిది వేల రూపాయలు గ్రామ పంచాయతీకి ఆదాయం రాగా ఈసారి రికార్డ్ స్థాయిలో మూడు లక్షల ఏడు వేల రూపాయలు అదనపు ఆదాయం వచ్చిందని పేర్కొన్నారు.వేలం పాటల సందర్భంగా ఎటువంటి సంఘటనలు జరగకుండ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. పంచాయతీ సిబ్బంది, వేలం పాటదారులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు...

## ప్రమాదవశాత్తూ పొగాకు బేర్లు దగ్ధం

– రూ.1.50లక్షల నష్టం – బాధిత రైతుకు అండగా ఉంటానన్న కాపులపల్లె సర్పంచ్ తులసిరెడ్డి

**బనగానపల్లెరూరల్, మార్చి17, ప్రభాతవార్త:** బనగానపల్లె మండల పరిధిలోని కాపులపల్లె గ్రామంలో ప్రమాదవశాత్తూ పొగాకు బేర్లకు నిప్పు అంటుకోవడంతో గ్రామానికి చెందిన నెమలి వెంకటసుబ్బయ్య కుమారుడు నెమలి వెంకటకృష్ణయ్యకు చెందిన పొగాకు అగ్నికి ఆహుతైంది. ఆదివారం మధ్యాహ్నం 3.30గంటల సమయంలో మంటలు చెలరేగడాన్ని గమనించిన గ్రామ ప్రజలు పక్కనే ఉన్నా ఎస్సార్బీసీ కాలువ నుండి బిందెల ద్వారా నీరు తెచ్చి మంటలను అదుపు చేశారు. దీంతో ప్రమాదం తప్పింది. కాని అగ్ని ప్రమాదంలో రూ.1.50లక్షల పంట నష్టం జరిగినట్లు బాధిత రైతు తెలిపారు. ఈ ప్రమాద ఘటన తెలుసుకున్న కాపులపల్లె సర్పంచ్ తులసిరెడ్డి అక్కడికి వెళ్లి బాధిత రైతును వారి కుటుంబాన్ని పరామర్శించి వారికి అండగా ఉంటానని భరోసానిచ్చారు. అదే విధంగా బనగానపల్లె పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్ ప్రమాద స్థలాన్ని పరిశీలించి బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. ఇందులో భాగంగానే బాధిత రైతు నెమలి వెంకటకృష్ణయ్య మాట్లాడుతూ తాను పొలాన్ని కౌలుకు తీసుకుని పొగాకు పండించడం జరిగిందని 2.30గంటల సమయం తరువాత కల్లంలోని తన భార్య భోజనానికి ఇంటికి రాగా కష్టపూరితంగానే నిప్పు అంటించడం జరిగిందని ఆయన వాపోయారు. తనకు సుమారుగా రూ.1.50లక్షలు నష్టం వాటిల్లిందని ప్రభుత్వం తనను ఆదుకోవాలని ఆయన కోరారు.

## పది పరీక్షలు ప్రశాంతంగా రాయండి

– మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి



**బనగానపల్లెరూరల్, మార్చి17, ప్రభాతవార్త:** పదవ తరగతి పబ్లిక్ పరీక్షలను విద్యార్థిని, విద్యార్థులు ప్రశాంతంగా రాయాలని బనగానపల్లె గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి సూచించారు. సోమవారం ఆయన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. సోమవారం నుండి నియోజకవర్గంలోని ఆయా మండల కేంద్రాల్లో పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభమయ్యాయని పరీక్షలు రాస్తున్నా విద్యార్థులందరికి బీసీ రాజారెడ్డి హార్దిక శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థిని, విద్యార్థులు పబ్లిక్ పరీక్షలంటే ఆందోళన చెందకుండా మనస్సును ప్రశాంతంగా ఉంచుకోని పరీక్షలురాసి మంచి మార్కులతో ఉత్తీర్ణులవ్వాలని ఆయన ఆకాంక్షించారు. అలాగే పరీక్షల సమయంలో ఎలాంటి ఒత్తిళ్లకు లోనుకాకుండా ఉండాలన్నారు. మీ మానసిక బలమే మీకు కొండంత ధైర్యమిస్తుందన్నారు. అదే విధంగా కష్టపడి కాకుండా ఇష్టపడి చదువుకుని పరీక్షలు రాస్తే మంచి మార్కులు సాధించే అవకాశం ఉంటుందన్నారు. నియోజకవర్గంలోని ఆయా మండల కేంద్రాల్లో పరీక్షలు రాస్తున్నా విద్యార్థులందరూ వంద శాతం సాధించడంతోపాటు అత్యుత్తమ మార్కులు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు తన వంతు చేయూతనిచ్చేందుకు తమ తల్లిదండ్రులైన కీ.శే.బీసీ గుర్రెడ్డి, బీసీ లక్ష్మమ్మ జాపకార్థం ప్రతిభ నగదు పురస్కారాలను ప్రకటించడం జరిగిందన్నారు. మండలస్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించిన విద్యార్థికి రూ.50వేలు నగదు బహుమతి, మెమొంటో, జిల్లాస్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించిన విద్యార్థికి లక్ష రూపాయల నగదు బహుమతి, మెమొంటో అందజేయనున్నట్లు బీసీ రాజారెడ్డి తెలిపారు. కావునా నియోజకవర్గంలో పరిధిలోని విద్యార్థులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకుని జిల్లాస్థాయి, మండలస్థాయిలో ప్రథమ ర్యాంకులు సాధించి నగదు ప్రతిభ పురస్కారాలను తమ సొంతం చేసుకోవాలని ఆకాంక్షించారు.

## పగడ్బందీగా పది పరీక్షల నిర్వహణ

– ప్రశాంతంగా మొదటి రోజు ప్రారంభమైన పది పరీక్షలు

**గడివేముల, మార్చి17, ప్రభాతవార్త;** మండలకేంద్రమైన గడివేములలోని రెండు పరీక్షా కేంద్రాల్లో సోమవారంనాడు పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఉదయమే పరీక్షా కేంద్రాలకు చేరుకున్న విద్యార్థులను పరీక్ష సమయానికి సెంటర్‌లలోకి అనుమతించారు. ఉదయం 9;30 గంటలకు పరీక్ష ప్రారంభమయ్యింది. మొదటిరోజు జరిగిన పదో తరగతి పరీక్షలకు గడివేములలోని మోడలల్‌స్కూల్ పరీక్షా కేంద్రంలో పరీక్ష చీఫ్ ప్రతాప్ పర్యవేక్షణలో 207 మంది విద్యార్థులకుగానూ 206 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవ్వగా, జెడ్పీహెచ్ స్కూల్ పరీక్షా కేంద్రంలో ఎగ్జామ్ చీఫ్ విక్టర్ ఇమ్మానియేల్ పర్యవేక్షణలో 200 మందికిగానూ 199 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు తెలిపారు. విద్యాశాఖ సిబ్బంది పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మంచినీటి సదుపాయం, వైద్య సదుపాయం అందుబాటులో ఉంచామన్నారు. ఎంఈఓ మేరీ సునీత గడివేములలోని రెండు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసి, పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలించారు. గడివేముల ఎస్ఐ సి.సి.నాగార్జునరెడ్డి, పోలీసు సిబ్బంది పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించారు. పరీక్షా కేంద్రాల వద్ద మొదటిరోజు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా జరిగాయి.

## వేసవికాలంలో పట్టణ ప్రజల దాహార్తిని తీర్చడమే ఆశయం

డ్రైనేజి కాల్వల మరమ్మత్తులు, కొత్తపైప్పులైన్ల పనులు శరవేగం
ఆత్మకూరు మున్సిపల్ కమీషనర్ రమేష్‌బాబు

**ఆత్మకూరు,మార్చి17,ప్రభాతవార్త:** వేసవి కాలంలో పట్టణ ప్రజల దాహార్తిని తీర్చే విదంగా మున్సిపాలిటి అధికారుల ఆశయమని ఆత్మకూరు మున్సిపాలిటి కమీషనర్ రమేష్‌బాబు తెలిపారు. పట్టణంలోని పలు వార్డుల పరిధిలో నూతన పైప్పులైన్లు ఏర్పాటు చేసి ప్రజల దాహార్తిని తీర్చే విదంగా అభివృద్ధి పనులను శరవేగంగా కొనసాగిస్తున్నారు. శ్రీశైలం ఎంఎల్ఏ బుడ్డా రాజశేఖరరెడ్డి ఆదేశాలతో పట్టణ ప్రజలకు అన్ని మౌలిక సదుపాయాలు కల్పించడంలో అధికార యంత్రాంగం ముందుంటుందని తెలిపారు. మార్చి నెల ముగిసేలోపు ఇంటి, కుళాయి పన్నులు చెల్లించి మున్సిపాలిటి అభివృద్ధికి ప్రజలు సహకరించాలని వివరించారు. సోమవారం పట్టణంలోని పలు వార్డులలో డ్రైనేజి కాల్వలో మరమ్మత్తుల పనులు, పూడిక తీత పనులను చేపట్టారు. ప్రజలకు స్వచ్చమైన మంచినీరు అందించే విదంగా నూతన పైప్పులైన్ల పనులను పర్యవేక్షణ చేస్తూ ప్రజలకు అన్ని విదాలుగా మౌలిక సదుపాయలు కల్పించడమే తమ ఆశయమని అన్నారు. విద్యుత్ దీపాలు, ఎల్ఈడి బల్బులు, 24వార్డుల పరిధిలో ప్రజలకు కావాల్సిన కాలనీలలో సీసీ రోడ్లు, డ్రైనేజి కాల్వలు మంచినీటి పైప్పులైన్లతో పాటు పలు అభివృద్ధి పనులు కొనసాగిస్తున్నట్లు వివరించారు. ఏవైన ప్రజా సమస్యలుంటే నేరుగా మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకోని వస్తే వెంటనే ఆ సమస్యలను పరిష్కరిస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు.

## 19నుండి 28వరకు అదార్ అప్‌డేట్ కేంద్రాలు ఏర్పాటు

**కోవెలకుంట్ల, మార్చి 17,ప్రభాతవార్త**

ఈ నెల 19వ తేది నుండి 28వ తేది వరకు అదార్ ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు యంపిడిఓ వరప్రసాదు చెప్పారు. అందులో బాగంగా19నుండి 25 వరకు కోవెలకుంట్ల 2లో 20వ తేది నుండి 26 వరకు కోవెలకుంట్ల -3లో 21నుండి 27వరకు కోవెలకుంట్ల -4-5లో ఏర్పాటు చేశామని చెప్పారు. 19నుండి28వరకు గుల్లదుర్తిలో 19నుండి 25వరకు భీమునిపాడులో, 20నుండి 26వరకు రేవనూరులో 21నుండి 27వరకు బిజినవేముల, సౌదరదిన్నెలో 22నుఏండి 28వరకు చిన్నకొప్పెర్లలో ఈ అదారు అప్‌డెట్ కేంద్రాలు ఏర్పాటు చేశామని అయన చెప్పారు.

## మహిళలు క్యాన్సర్ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలి

**గోనెగండ్ల, మార్చి, 17,ప్రభాతవార్త**

కర్నూలు జిల్లాలోని మహిళలు క్యాన్సర్ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని అలాగే క్యాన్సర్ పట్ల వారికి అవగాహన కల్పించడం ఆరోగ్యశాఖ అధికారులు,ఆర్యోగకార్యకర్తల బాధ్యత అని జిల్లా సంచార చికిత్స నోడల్ అధికారి రఘు అన్నారు.సోమవారం మండల కేంద్రమైన గోనెగండ్లలోని ఆరోగ్యకేంద్రంను నందు సామాజిక అరోగ్యకార్యకర్తలకు,మహిళ ఆరోగ్య కార్యకర్తలకు,ఎన్‌సీడీ,సీడీ వ్యాధుల స్క్రినింగ్ పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహించారు.వారికి దిశనిర్ధేశ్యాలు చేశారు.ఈ కార్యక్రమంకు స్థానిక వైద్యులు రంగరవళి హజరయ్యారు.ఈ సందర్భంగా సమీక్షా సమావేశంలో జిల్లా సంచార చికిత్స నోడల్ అధికారి రఘు మాట్లాడుతూ అసంక్రమిత వ్యాధులైన రోమ్ముక్యాన్సర్,నోటి క్యాన్సర్,గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌లు మహిళలకు సోకుతున్నాయని అందుకు గాను ప్రభుత్వం క్యాన్సర్ సర్వేలు చేపట్టిందని ఆయన తెలిపారు.ఆర్యోగ సిబ్బంది ప్రతి రోజు గ్రామాలలో సర్వేలు నిర్వహించాలని రోజుకు తప్పనిసరిగా 40 గృహాలను సందర్శించి అనుమానితులను గుర్తించాలని కోరారు.స్క్రీనింగ్‌లో బాగంగా సామాజిక ఆర్యోగకార్యకర్తలు,ఆశావర్కర్లు,క్యాన్సర్ వల్ల కలిగే దుష్ప్రబావాలపై ప్రజలలో అవగాహన కల్పించాలన్నారు.18 ఎళ్లు నిండిన వారికి రక్తపోటు,మధుమేహం,రక్తహీనత పరీక్షలు జరపాలని, అలాగే30 ఏళ్లు దాటిన వారికి రోమ్ము,నోటి,గర్బశయముఖ ద్వార క్యాన్సర్,పరీక్షలు వైద్యసిబ్బంది ఇంటింటికి వెళ్లి జరపాలని సూచించారు.ఇటీవల క్యాన్సర్ వ్యాధి గ్రాస్తులు పెరుగుతున్నారని ఇందుకు మారిన ఆహారపు అలవాట్లు,వ్యాయ ంచేయక పోవడం,కాలుష్యం కారణం అని తెలిపారు.నోటిలో ఎర్ర,తెల్ల మచ్చలలో పుండ్లు ఉంటే వెంటనే పరీక్షలు చేయించాలన్నారు.ఎన్‌సీడీ3.0యాప్‌లో ఎప్పటికి కప్పుడు సమాచారం నమోదు చేయాలని ఈ విషయంలో అలసత్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో వైద్యులు రుక్సానా,క్షేత్రస్థాయి పర్యవేక్షకులు,మేరీగోల్డ్,భారతి, హనుమంతు, సుధాకర్,శాంతమ్మ,కృష్ణ,ఆర్యోగకార్యకర్తలు పాల్గొన్నారు.

## చాగలమర్రిలో 23మంది గైర్హాజరు

**చాగలమర్రి, మార్చి 17 , ప్రభాతవార్త**

మండలకేంద్రమైన చాగలమర్రిలో పదిపరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు పరీక్షలకు 23మంది గైర్హాజరయ్యారు. బాలుర ఉన్నతపాఠశాలలో నిర్వహించిన పరీక్షకేంద్రాన్ని 260 మంది విద్యార్థులకు కేటాయించగా 257మంది హాజరయ్యారు. అలాగే బాలికల ఉన్నతపాఠశాలలో 250మంది విద్యార్థులకు కేటాయించగా 246మంది హాజరయ్యారు. సెయింట్ ఆన్స్ పాఠశాలకు 250మంది విద్యార్థులకు కేటాయించగా 239 మంది హాజరయ్యారని ఎంఇఓలు అనురాధ, నయంతుల్లాలు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండ ఆళ్లగడ్డ డిఎస్‌పి ప్రమోద్ ఆదేశాల మేరకు సిఐ మురళీధర్‌రెడ్డి, ఎస్ఐ హరిప్రసాద్‌లు 144సెక్షన్‌తో పాటు కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటుచేశారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు అవసరమయ్యే మౌలిక సదుపాయాలను ఎంఇఓ అనురాధ పరిశీలించారు. మాస్‌కాఫీయింగ్‌కు పాల్పడిన, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన వారిపై చర్యలు తీసుకుంటామని ఎంఇఓ తెలిపారు.

## హనుమాన్ జంక్షన్ చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ కేంద్రం ఏర్పాటు

**వెల్దుర్తి,మార్చి17,ప్రభాతవార్త :** వెల్దుర్తి పట్టణ సమీపంలోని హనుమాన్ జంక్షన్‌లో జంగమ మహేశ్వరసంఘం మండల ఇంచార్జ్ చాముండేశ్వరి,హనుమాన్ ఆలయ నిర్వాహకులు రామాంజనేయులు ఆధ్వర్యంలో చలివేంద్రం నందు మజ్జిగ పంపిణీ కేంద్రాన్ని ఏర్పాటుచేశారు.అక్కడకు వచ్చిన వారికి స్వయంగా చాముండేశ్వరి మజ్జిగను పోసి ఇచ్చి వారి దాహర్తిని తీర్చారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండు వేసవిలో వాహనదారులు,ప్రయాణికులు,బాటసారుల దప్పిక తీర్చేలా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం ఎంతో సంతోషకరమన్నారు.ఈ కార క్రమంలో జంగమ మహేశ్వరసంఘం మండల ఇంచార్జ్ చాముండేశ్వరి,హనుమాన్ ఆలయ నిర్వాహకులు రామాంజనేయులు,ఆ సంఘం నాయకులు మల్లికార్జునయ్య,దుగ్గినాగేశ్వరయ్య ,మహిళభక్తులు బుజ్జక్క,లక్ష్మీదేవి పాల్గొన్నారు.

## టోపీ మారెమ్మవ్వ దేవాలయంలో హుండీ చోరీ....

– ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు



**హాలహర్వి, మార్చి17, ప్రభాతవార్త;** మండలంలోని అమృతాపురం గ్రామ సమీపంలో వెలసిన శ్రీ టోపీ మారెమ్మవ్వ ఆలయంలో హుండీ చోరీ అయ్యింది. గుర్తు తెలియని వ్యక్తులు ఆలయంలో హుండీ చోరీ చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. విషయం తెలుసుకున్న ఆలూరు సీఐ శివశంకర్‌రెడ్డి, హాలహర్వి ఎస్ఐ చంద్ర సంఘటనా స్థలానికి చేరుకుని హుండీ చోరీకి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆలయ ప్రాంగణంలో దుండగుల ఆనవాళ్లను పరిశీలించారు. అమ్మవారి హుండీ చోరీపై స్థానిక ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చంద్ర తెలిపారు.

## ఈనెల 20వతేదిన మున్సిపాలిటిలో వ్యాపారాల వేలం పాట

మునిసిపల్ కమీషనర్ రమేష్‌బాబు

**ఆత్మకూరు,మార్చి17,ప్రభాతవార్త:** ఈనెల 20వతేదిన ఆత్మకూరు మున్సిపాలిటిలో జరిగే వివిద వ్యాపారాల మార్కెట్‌లను వేలం పాట వేయడం జరుగుతుందని మున్సిపల్ కమీషనర్ రమేష్‌బాబు విలేకరులకు తెలిపారు. ఆసక్తిగల వారు 25-2026 ఆర్థిక సంవత్సరం సంబందించిన వేలం పాటలో పాల్గొన్నాలని వివరించారు. వారపు సంత మార్కెట్, దిన కూరగాయాల మార్కెట్, బస్టాండ్ పీజులు, చిన్న కమేళా, పెద్ద కమేళాతో పాటు చేపలు, చికెన్ అమ్మకాలపై 1.04.2025 నుంచి 31.03.2026 అర్ధరాత్రి వరకు వేలంలో దక్కించుకున్న వారు అవకాశం ఉంటుందని వివరించారు. ఈ వేలం ప్రకటనలో పాల్గొనే వారు మున్సిపల్ కార్యాలయంలో అధికారులను సంప్రదించి పూర్తి వివరాలను తీసుకోవాలని పిలుపు నిచ్చారు. గజిట్‌లోని షరత్తులు, నిబందనలు తప్పక పాటించాలని వివరించారు. వేలాలలో పాల్గొనేవ్యక్తులు రెవెన్యూ సెక్షన్‌లో మున్సిపల్ కార్యాలయంలో సంప్రదించాలని వివరించారు.

## ఉపాధి పనులను వేగవంతం చేయండి

**ఉయ్యాలవాడ, మార్చి 17, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని ఉయ్యాలవాడ గ్రామంలో ఉన్న మండలప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉపాధి పనులను వేగవంతం చేయాలని ఏపీఓ రవి ప్రకాష్ తెలిపారు. మండలంలో జాతీయ ఉపాధి హామిపథకం కింద వచ్చే కూలీల సంఖ్య రోజు రోజుకు తగ్గిపోతుంది. అందువల్ల పనులు సరైన సమయానికి చేయలేకపోతున్నారని ఏపీఓ తెలిపారు. పనులు సకాలంలో జరగాలంటే ఎస్ఏలో ప్రత్యేక చొరవచూపాలన్నారు. పనులకు కూలీలు సరైన సయానికి రావాలి. ఇచ్చిన కొలతల ప్రకారం పనులు పూర్తిచేయాలన్నారు. ఈకార్యక్రమంలో ఎస్ఏలు పాల్గొన్నారు.

## లారీ ప్రమాదంలో మృతి చెందిన గొర్రెలు..

**మిడుతూరు మార్చి 17 ప్రభాతవార్త:**

మండల కేంద్రమైన మిడుతూరు నుండి నందికొట్కూరు పట్టణానికి వెళ్లే రహదారిలో పంచముఖి గోడౌన్ సమీపంలో సోమవారం తెల్లవారుజామున వెంకట సుబ్బడు చెందిన దాదాపు రెండు లక్షలు విలువ చేసే 8 గొర్రెల పైన లారీ దూసుకెల్లగా గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. ప్రమాదం జరిగిన సంఘటన స్థలం నుండి లారీ నిలబెట్టకుండా ముందుకు వెళ్లిపోయారు. మిడుతూరు నుండి సోమవారం తెల్లవారుజామున దాదాపు 200 గొర్రెలు నందికొట్కూరు మార్కెట్లో విక్రయించడానికి బయలుదేరి వెళ్లాయి. అయితే నందికొట్కూరు నుండి వస్తున్న భారీ వాహనం గొర్రెల పై దూసుకుపోయింది. బాధితుడు ఈ విషయాన్ని స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన ఎస్ఐ ఓబులేసు భారీ వాహనాలు అంటే గడివేముల పరిధిలో ఉన్న ఫ్యాక్టరీ కి వెళ్లే వాహనాలుగా గుర్తించి అనుమానంతో తన సిబ్బందిని అక్కడికి పంపి విచారించారు. అయితే అక్కడ గొర్రెల ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించి వెంటనే ఆ వాహనాన్ని స్థానిక పోలీస్ స్టేషన్కు తరలించారు. ఈ సమస్యపై పోలీసులు విచారణ చేస్తున్నారు.

## యాగంటి శ్రీ ఉమామహేశ్వర్లకు వైభవంగా పల్లకి మహోత్సవం

**బనగానపల్లెరూరల్, మార్చి17, ప్రభాతవార్త:** బనగానపల్లె మండలంలోని ప్రముఖ శైవక్షేత్రమైన యాగంటి శ్రీ ఉమామహేశ్వరస్వామి ఆలయం నందు సోమవారం సందర్భంగా వైభంగా పల్లకి మహోత్సవం నిర్వహించారు. ఈ మేరకు ప్రదోషకాల ప్రత్యేక పూజల అనంతరం శ్రీ స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను అందంగా అలంకరించి పల్లకి నందు కూర్చుండజేసి నందిమండపంలో వేంచేపుచేసి ప్రత్యేక పూజల అనంతరం శ్రీ స్వామి అమవార్లకు ఆలయ ప్రాంగణంలో శాస్రోక్తంగా మరియు వైభవోపేతంగా పల్లకి మహోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం అక్కడికి వచ్చిన భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలను ఆలయ అర్చకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి బి.చంద్రుడు, పాతపాడు సర్పంచ్ బెడదల మహేశ్వరరెడ్డి, యాగంటిపల్లె ఉపసర్పంచ్ బండి మౌలీశ్వరరెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు మహేష్ శర్మ, సత్యనారాయణ శర్మ, లోకనాథ్ శర్మ, దేవుడు, రాఘవేంద్ర శర్మ, ఆలయ సిబ్బంది రమేష్‌బాబు, ప్రసాద్ పాల్గొన్నారు.

## ప్రశాంతంగా పదవ తరగతి పరీక్షలు ప్రారంభం

**గోనెగండ్ల,మార్చి,17,ప్రభాతవార్త**

మండల కేం ద్రమైన గోనెగండ్లలో ఉన్నత పాఠశాలలో మూడు పరీక్షా కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది.మోడల్ స్కూల్,జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,జూనియర్ కళాశాలలో పదవ తరగతి పరీక్షా కేంద్రాలను విద్యాశాఖ ఏర్పాటు చేసింది.మొత్తం 627 మంది విద్యార్థులకు గాను 617 మంది విద్యార్థులు పరీక్షకు హజరయ్యారని ఎంఈవో నీలకంఠ తెలిపారు.పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి.10 మంది విద్యార్థులు పరీక్షలకు హజరు కాలేదు.అయితే సమయం దగ్గర పడుతుండటంతో విద్యార్థులు పరుగు పరుగున వచ్చి పరీక్షకు హజరయ్యారు. మూడు పరీక్షా కేంద్రల దగ్గర ఏలాంటి అవాంఛనీయ సంఘటనల జరగకుండా ముందుస్తుగా 144 సెక్షన్ ను అమలు చేస్తున్నట్లు సీఐ విజయభాస్కర్ తెలిపారు.గోనెగండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి గాజులదిన్నె ప్రాజెక్టు దగ్గర ఉన్న మోడల్ స్కూల్,జూనియర్ కళాశాల వరకు విద్యార్థుల రాక పోకలకు ఉచిత బస్సును ఏర్పాటు చేశారు.పరీక్షలు పూర్తి అయ్యాక ఎంఈవో నీలకంఠ విద్యార్థులతో మాట్లాడారు.పరీక్షా కేంద్రంలో ఎమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగారు.అలాగే పరీక్షలు ఎలా వ్రాశారు,అని ఆరా తీశారు.అనంతరం పరీక్ష రాసేందుకు సమీప గ్రామాల నుంచి వచ్చిన విద్యార్థులను ఎంఈవో దగ్గర నుంచి ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉచిత బస్సును ఎక్కించారు.

## కుట్టు మిషన్ల శిక్షణను సద్వినియోగం చేసుకోండి

**పత్తికొండ,మార్చి 17,ప్రభాతవార్త:**

మహిళలు మండలంలో ఇస్తున్న కట్టుమిషన్ల శిక్షణను ఉపయోగించుకోవాలని ఇన్‌చార్జ్ ఎం.పి.డి.ఓ. నరసింహ్మడు ఓ ప్రకటనలో తెలిపారు. పత్తికొండ మండలంలో బీసీ కార్పోరేషన్ ద్వారా కుట్ట మిషన్ల శిక్షణ తరగతులకు ఆన్‌లైన్లో సచివాలయంలో అప్లై చేసుకోవాలని ఆయన తెలిపారు.

## కొలిమిగుండ్ల మండలంలో ప్రారంభమైన పదవ తరగతి పరీక్షలు

– హాజరైన 558 మంది విద్యార్థులు

**కొలిమిగుండ్ల, మార్చి17, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన కొలిమిగుండ్లతోపాటు మండలంలోని ఆయా పరీక్ష కేంద్రాల్లో ప్రారంభమైన పది పరీక్షలు సోమవారం తెలుగు పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఇందులో భాగంగా కొలిమిగుడ్లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 157 మంది విదా ్యర్థులు,అలాగే మోడల్ స్కూల్ నందు 168 మంది విద్యార్థులు, మండల పరిధిలోని అంకిరెడ్డిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 163 మంది విద్యార్థులు, తిమ్మనాయునిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 71 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. కాగా మండలంలోని నాలుగు సెంటర్లల్లో కలిపి మొత్తం 565 మంది విద్యార్థులకు గాను వీరిలో 7 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు మండల విద్యాధికారి అబ్దుల్ కలాం తెలియజేశారు.

## మాకు ప్రమోషన్ ఛానల్ కల్పించండి

– ఏఈలకు ఇంజనీరింగ్ అసిస్టెంట్‌ల విన్నపం



**మంత్రాలయం,మార్చి 17,ప్రభాతవార్త:** మండలంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లుగా కొనసాగుతున్న మాకు ప్రమోషన్ ఛానల్ అవకాశాన్ని కల్పించాలని మండలంలోని ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు ఏఈలకు సోమవారం విన్నవించారు.ఈ మేరకు వారు ఏఈపిఆర్ మల్లయ్య,హౌసింగ్ డిఈ లాల్‌కృష్ణయ్యకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు పంచాయతీరాజ్,ఆర్‌డబ్ల్యుఎస్, పంచాయతీ,హౌసింగ్, ఎస్ఎస్ఏ తదితర డిపార్ట్‌మెంట్ లకు విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఒక ఇంజనీరింగ్ అసిసిస్టెంట్ ఒక ఇంజనీరింగ్ శాఖలోనే ఉండాలని పేర్కొన్నారు.మాకు ప్రమోషన్ అవకాశాలు కల్పించాలంటే ఏదోఒక్క డిపార్ట్‌మెంట్ ఉద్యోగులుగా ఉండాలని ప్రభుత్వ నిబంధనలు ఉన్నాయన్నారు.కావున మామీద దయవుంచి ప్రభుత్వ ఉన్నతాధికారులతో చర్చించి మాకు ప్రమోషన్ అవకాశాలు కల్పించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు పవన్, శివ, రంగమ్మ, రిజ్వానా, సాహితి, కవిత, భీమేష్ తదితరులు పాల్గొన్నారు.

## అనుమానస్పదంగా వ్యక్తి మృతి

**కొత్తపల్లె, మార్చి 17, ప్రభాతవార్త:** రాత్రి సమయంలో పొలానికి కావలి వెళ్లి మచ్చుపై అనుమానస్పందంగా ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన కొత్తపల్లి మండల కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొత్తపల్లి మండల కేంద్రానికి చెందిన చాకలి ఆంజనేయులు (38) ఆదివారం రాత్రి అడవి పందుల బెడద నుంచి వేరుశనగ పంటను కాపాడేందుకు కాపల వెళ్లారు. సోమవారం ఉదయాన్నే తనస్నేహితుడు వెంకటరమణ పొలానికి నీరు పెట్టేందుకు డీజిల్ తీసుకెళ్లగా మచ్చుపై విగతజీవిగా పడివున్న ఆంజనేయులును చూసి వారి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వారు అక్కడికి చేరుకొని ఆంజనేయులు మృతదేహాన్ని చూసి పొలానికి కాపల వెళ్లి తిరిగి రాని లోకాలకు వెళ్లారంటూ బోరున విలపించారు. మృతుడికి భార్య ఇద్దరు కుమారులున్నారు. పాము లేదా ఏదైనా విషపురుగు కాటువేయడంతో చనిపోయాడా..? లేదా ఏ ఇతర కారణాల చేత చనిపోయాడో తెల్చాలని మృతుడి భార్య అనిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు కొత్తపల్లి ఎస్ఐ ఎం కేశవ తెలిపారు.

## రాజరాజేశ్వరి పాఠశాల యాజమాన్యం ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

– ఇఫ్తార్ విందుకు హాజరైన ముస్లీం సోదరులు

**గడివేముల, మార్చి17, ప్రభాతవార్త;** మండలకేంద్రమైన గడివేములలోని శ్రీ రాజరాజేశ్వరి ఉన్నత పాఠశాల యాజమాన్యం ఆధ్వర్యంలో సోమవారంనాడు రంజాన్ పవిత్ర మాసాన్ని పురస్కరించుకుని ముస్లీం సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ముస్లీం పెద్దలు మాట్లాడుతూ మతసామరస్యానికి ప్రతీకగా ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయడం శ్రీ రాజరాజేశ్వరి ఉన్నత పాఠశాల యాజమాన్యం గొప్పతనమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మండలాధ్యక్షుడు వంగాల శ్రీనివాసరెడ్డి, సీనియర్ నాయకులు బిడుదూరి సీతారామరెడ్డి, మాజీ సర్పంచ్ జమాల్‌బాషా, దేశం నారాయణరెడ్డి, పాఠశాల కరస్పాండెంట్ ఎం.రామేశ్వరరావు, ఏఓ రాఘవేంద్రరావు, పాఠశాల ఉపాధ్యాఉలు పాల్గొన్నారు.

## పకడ్బందిగా పరీక్షలు నిర్వహించాలి

**కొత్తపల్లె, మార్చి 17, ప్రభాతవార్త:** పకడ్బందిగా పరీక్షలు నిర్వహించాలని ఆత్మకూరు గ్రామీణ సిఐ సురేష్‌కుమార్‌రెడ్డి, ఎంఈఓ ఇనాయతుల్లా అన్నారు. సోమవారం కొత్తపల్లి, గోకవరం పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. ప్రశాంతంగా పది పరీక్షలు పూర్తి అయ్యేలా చూడాలన్నారు. కొత్తపల్లి పరీక్షా కే ంద్రంలో 176 మందికి గాను 173 మంది విద్యార్థులు హాజరయ్యారని ముగ్గురు గైర్హాజర య్యారన్నారు. గోకవరం పరీక్షకేంద్రంలో 90 మందికి గాను 83 మంది హాజరవ్వగా 7 మంది విద్యార్థులు గైర్హాజరయినట్లు పరీక్షాకేంద్రాల అధికారి వెంకటశివుడు తెలిపారు. ముసలిమడుగు, శివపురం, దుద్యాల జడ్పీ పాఠశాల విద్యార్థులు ఆటోల ద్వారా పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు.

## సల్కాపురంలో ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంపు

**కల్లూరు, మార్చి 17, ప్రభాతవార్త:**

కర్నూలు మండలం సల్కాపురం గ్రామంలో గవర్నమెంట్ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ మంజురాణి అధ్యక్షతన సల్కాపురం గ్రామ సర్పంచ్ మద్దిలేటి ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంపు నిర్వహించడం జరిగింది. ఈసందర భంగా వారు మాట్లాడుతూ 17-03-2025 నుండి 23-03-2025 వరకు ఈక్యాంపు నిర్వహించబడునని ముఖ ్యంగా డ్రగ్స్ వద్దు జీవితం ముద్దు మాదకద్రవ్యాల దుర్వినియోగం అపండి. ధూమపానం, మద్యపానం ఆరోగ్యానికి హానికరం మత్తులో జగత్ జీవితం చిత్తు అవుతుందని గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో టిడిపి ఇంచార్జీ దేవేంద్రరెడ్డి, మెడికల్ అఫీసర్ మనోజ్‌కుమార్, ఎన్ఎస్ఎస్ పిడి అన్నపూర్ణ, ఎన్ఎస్ఎస్ టీమ్ మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# తమ భూమిని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

**- తహశీల్దార్‌ను ఆశ్రయించిన బాధితులు**

**పెద్దకడుబూరు, మార్చి 17, ప్రభాతవార్త**

మండల కేంద్రమైన పెద్దకడుబూరు గ్రామ రెవెన్యూ పొలిమేర పరిధిలోని సర్వేనెంబర్ 165లో 2ఎకరాల66సెంట్లు, సర్వేనెంబర్ 164/ఎ5 నందు 1ఎకరా41సెంట్లు మొత్తం 3ఎకరాల7సెంట్ల భూమిని పెద్దకడుబూరు గ్రామానికి చెందిన వైసిపి నాయకులు ముక్కరన్న గత ప్రభుత్వంలో జరిగిన రీ భూసర్వేలో అధికారులకు ముడుపులిచ్చి తన భార్య పేరుమీద ఆన్‌లైన్ చేయించుకుని అతని కొడుకుకు దానవిక్రయం చేసినట్లు తప్పుడు రిజిస్ట్రేషన్ చేయించుకుని తమ భూమిని కబ్జా చేశాడని అతనిపై చర్యలు తీసుకోవాలని గంగులపాడు గ్రామానికి చెందిన బాధితులు కురువ కృష్ణ, కురువ సోము, పింజరి మోయిద్దీన్‌లు సోమవారం తహశీల్దార్ గీతా ప్రియదర్శినిని ఆశ్రయించారు. ఈ సందర్భంగా వారు విలేకర్లతో మాట్లాడుతూ మా తాతలైన గంగులపాడు పెద్దలింగప్ప, ఈశ్వరప్ప పేర్ల మీద వ్యవసాయ భూమి కలదని సదరు భూమి మాకు మా పెద్దల వలన సంక్రమించబడిన వంశపార్యంపరంగా నేటికి సాగుబడి చేసుకుంటున్నామని గత 60ఏళ్ల నుండి ఇప్పటివరకు ఆ భూమి మా స్వాధీనంలోనే ఉందన్నారు. అయితే తమకు తెలియకుండ గత ప్రభుత్వంలో తమ భూమిని అక్రమంగా కబ్జా చేసి తమకు అన్యాయం చేశారని అధికారులను మ్యానేజ్ చేసుకుని వెబ్‌ల్యాండ్ నందు మా తాతల పేర్లు తొలగించి అక్రమంగా వెబ్‌ల్యాండ్ ఆన్‌లైన్ నందు ముక్కరన్న కుటుంబ సభ్యుల పేర్లు నమోదు చేసుకున్నారని తెలిపారు. తమ భూమిని వేరేవారి పేర్లమీద ఆన్‌లైన్ ఎక్కించే సమయంలో తమకు కనీసం నోటీసులు కూడా ఇవ్వకుండ అప్పటి విఆర్‌ఓ, ఆర్ఐ ఫీల్డ్ ఎంక్వయిరీ చేయకుండ ఎలా వేరేవాళ్ల పేర్లు నమోదు చేస్తారని వారు ప్రశ్నించారు. భూ కబ్జాకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని కోరారు.





## ప్రశాంతంగా ప్రారంభమైన పది పరీక్షలు

**హాలహర్వి, మార్చి17, ప్రభాతవార్త;**

మండలకేంద్రమైన హాలహర్విలో సోమవారం పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పరీక్షలకు మొదటిరోజు 441 మంది విద్యార్థులు హాజరవ్వగా, 7 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈఓ శ్రీనివాసరెడ్డి తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులకు తగునీరు, వైద్య తదితర సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు.

## ప్రశాంతంగా ప్రారంభమైన 10వతరగతి పరీక్షలు

**- 12మంది విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరు - మండల పర్యవేక్షకులు పి.సుభాన్**

**పగిద్యాల, మార్చి 17, ప్రభాతవార్త**

పగిద్యాల మండలంలోని 10వతరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమైనట్లు 10వతరగతి పరీక్షల పర్యవేక్షకులు పి.సుభాన్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని పి.ముచ్చుమర్రి జెడ్పీపాఠశాల పరీక్షాకేంద్రం, పగిద్యాల జెడ్పీపాఠశాల పరీక్షా కేంద్రం, లక్ష్మాపురం అంచవద్దఉన ఏపిడబ్ల్యూ ఆర్ఎస్ పరీక్షా కేంద్రాలను పరిశీలించామన్నారు. ఏలాంటి అసౌకర్యానికి గురికాకుండా విద్యార్థులకు అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. లక్ష్మాపురం అంచవద్ద ఉన్న ఏపిడబ్ల్యూఆర్ఎస్ పరీక్షాకేంద్రంలో సిట్టింగ్ స్క్వాడ్ పి.శ్రీనాథ్ విధులు నిర్వహించారు. పగిద్యాల జెడ్పీపాఠశాల పరీక్షా కేంద్రంలో 164 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకావలసి వుండగా 163మంది హాజరుకాగా ఒక్కరు మాత్రం గైర్హాజరయ్యారనీ, అదేవిధంగా ఏపి డబ్ల్యూఆర్ఎస్ పరీక్షా కేంద్రంలో 161 మంది విద్యార్థులు పరీక్షలకుహాజరుకావలసి వుండగా 155 మంది విద్యార్థులు హజరుకాగా 6మంది విద్యార్థులు గైర్హాజరయ్యారనీ, పి.ముచ్చుమర్రి జెడ్పీపాఠశాల పరీక్షాకేంద్రంలో 98మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకావలసి వుండగా 93మంది హాజరుకాగా 5మంది విద్యార్థులు గైర్హాజరైయ్యారన్నారు. పి.ముచ్చుమర్రి, పగిద్యాల, ఏపిడబ్ల్యూఆర్ఎస్ పరీక్షా కేంద్రాలలో 423 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకావలసి వుండగా 411 మంది విద్యార్థులు హజరయ్యారనీ మూడు పరీక్షా కేంద్రాలలో 12మంది విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరైనట్లు మండల పర్యవేక్షకులు పి.సుభాన్ తెలిపారు.

**పరీక్షా కేంద్రాలవపరిసరాలను పరిశీలించిన ముచ్చుమర్రి ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డి :** పగిద్యాల మండలంలో సోమవారం ప్రారంభమైన 10వతరగతి పరీక్షా కేంద్రాల పరిసరాలను ముచ్చుమర్రి ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డి పరిశీలించారు.

## ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న మేటీలకు శిక్షణ

**పగిద్యాల, మార్చి 17, ప్రభాతవార్త**

వెలుగు కార్యాలయంలో సోమవారం మండల అభివృద్ధి అధికారి శ్రీమతి సుమిత్రమ్మ అధ్యక్షతన కో-ఆర్డినేటర్ ఏసుదాసు మహాత్మాగాంధీ గ్రామీణ జాతీయ ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న మండలంలోని మేటీలకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. శిక్షణా కార్యక్రమంలో మేటీలకు ఎంత కొలతలవరకు పనిచేయాలీ, కూలీలు హాజరువేసి ఏవిధంగా పంపాలి, జాబుకార్డు ఏవిధంగా నింపాలి రోజు రూ. 300లు కూలీ వచ్చేవిధంగా మొదలగు అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపిఓ మద్దిలేటి, ఫీల్డు అసిస్టెంట్‌లు, మండలంలోని మేటీలు పాల్గొన్నారు.

## మండలంలో పది పరీక్షల్లో 13 మంది గైర్హాజరు

**తుగ్గలి, మార్చి 17, ప్రభాతవార్త:** మండలం పరిధిలో పదవ తరగతి పరీక్షలు సోమవారం మొదటి రోజు ప్రశాంతగా ప్రారంభమయ్యాయి. తుగ్గలి హైస్కూల్‌లో 190 రెగ్యులర్ విద్యార్థులకు గాను 185 మంది హాజరు కాగా అయిదు మంది గైర్హాజరు, సప్లిమెంటరీలో ఏడు మందికి గాను ఒకరు గైర్హాజరు అయినట్లుగా ఛీఫ్ ఉపేంద్ర, పాండురంగరాజు తెలిపారు. నోవి కాన్సెప్ట్ ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో 96 మందిలో ఇద్దరు గైర్హాజరు, సప్లిమెంటరీలో నలుగురు హాజరు అయినట్లుగా ఛీఫ్ మోహన్, డిఓ లక్ష్మణ్ తెలిపారు. పెండేకల్లు ఆర్.ఎస్.స్కూల్ నందు 167 కుగాను 162 మంది విద్యార్థులు హాజరయ్యారు. జొన్నగిరి హైస్కూల్ నందు 165 మందికి 164 మంది హాజరయ్యారు. సప్లిమెంటరీలో నలుగురుకు గాను ఒకరు గైర్హాజరు అయినట్లు ఛీఫ్ నరేంద్రప్రసాద్ తెలిపారు. మండలంలో మొత్తం 13 మంది గైర్హాజరయ్యారు. సప్లిమెంటరీలో 17 మందికి 15 మంది హాజరయ్యారు.

## నాటు సారా నిర్మూలనే ధ్యేయం

**ఆలూరు, మార్చి 17, ప్రభాతవార్త:** నాటు సారా నిర్మూలనే ధ్యేయంగా రాష్ట్ర మరియు జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్‌శాఖ అధికారులు పని చేస్తున్నారని డిటిఎఫ్ సి.ఐ.రాజేంద్రప్రసాద్, ఆలూరు సి.ఐ.లలి తాదేవి, ఎస్సై నవీన్‌బాబు తెలిపారు. సోమవారం జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రొహిబిషన్ మరియుఎక్సైజ్ శాఖ అధికారులు గ్రామాలలో దాడులు నిర్వహిస్తున్నారని, అందులో బాగంగా సర్కిల్ పరిధిలో ఒక వ్యక్తిని అరెస్టు చేసి అతని నుండి కర్ణాటక టెట్రా ప్యాకెట్లను మరియు ఐదు లీటర్ల నాటుసారా సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు వారు తెలిపారు. అనంతరం ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన నవోదయం 2.0 పథకాన్ని గూర్చి ప్రజలకు వివరించారు. ప్రతి ఒక్కరు నాటుసారా నిర్మూలనే ధ్యేయంగా నాటుసారా తయారిదారులు వారి వృత్తిని వదిలి ఇతర వనరులను చేసి కుటుంబాలను పోషించుకోవాలని తెలిపారు. నాటుసారా తయారిదారులపై పకడ్బంధిగా చట్టాలు వస్తాయని వారు హెచ్చరించారు.



## తొలిరోజు ప్రశాంతంగా పదిపరీక్షలు

**రుద్రవరం, మార్చి 17, ప్రభాతవార్త :** మండలకేంద్రమైన రు ద్రవరంలోని కన్యకాపరమేశ్వరి ఉన్నతపాఠశాల, నరసాపురం సెయింట్ ఆన్స్ మార్థోమా స్కూల్‌లో మొదటి రోజు పది పరీక్షలు ప్రశాంతంగా సాగాయి. పరీక్ష సమయానికంటె ముందే విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులకు కేటాయించిన గదులను హాల్‌టికెట్ల వారీగా పరిశీలించి గదులకు చేరుకున్నారు. పరీక్షల నిర్వహణ సిబ్బంది పరీక్షాకేంద్రాల వద్ద విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసి లోపలకు అనుమతించారు. పరీక్షా కేంద్రాలవద్ద అవాంఛనీయఘటనలు చోటుచేసుకోకుండ రుద్రవరం ఎఎస్ఐ రాంభూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటుచేశారు. మండలంలో ఏర్పాటుచేసిన రెండు పరీక్షా కేంద్రాల్లో 396మంది విద్యార్థులు పరీక్షలు రాయల్సి ఉండగా 376మంది హాజరుకాగా 20మంది గైర్హాజరయ్యారు. రుద్రవరం కన యకాపరమేశ్వరి స్కూల్‌లో ఒకరు, నరసాపురం సెయింట్ మార్థోమాస్కూల్‌లో 19మంది గైర్హాజరయ్యారని మండల విద్యాశాఖాధికారి వీరరాఘవయ్య తెలిపారు.

## క్లస్టర్ యూనివర్శిటిని అభివృద్ధి చేద్దాం

**కర్నూలు విద్య, మార్చి 17, ప్రభాతవార్త:** క్లస్టర్ యూనివర్శిటి అంటేనే ప్రత్యేక యూనివర్శిటి అని దీన్ని అందరం కలిసి అభివృద్ధి చేద్దామని క్లస్టర్ యూనివర్శిటి నూతన ఇంచార్జీ వీసీగా బాధ్యతలు స్వీకరించిన ఆచార్య వి వెంకట బసవరావు పేర్కొన్నారు. సోమవారం ఇంచార్జీ వీసీ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్లస్టర్ యూనివరి ్శటి వీసీగా బాధ్యతలు స్వీకరించినందుకు ఆనందంగా ఉందని ఈఅవకాశం కల్పించిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం క్లస్టర్‌యూనివర్శిటి రిజిస్ట్రార్ ప్రిన్సిపల్స్ డీన్స్ అధ్యాపకుల సమావేశంలో ఇంచార్జీ వీసీ మాట్లాడుతూ న్యాక్ అక్రిడిటేషన్, ఐక్యూఏసీ సెల్ కార్యచరణ ప్రణాళిక పరిశోధనా కార్యకలాపాల గురించి ముఖ్య సూచనలు చేశారు. యూనివర్శిటి మరింత అభివృద్ధి దిశగా తీసుకుపోవడం కోసం టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్ సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు.



## ప్రశాంతంగా పదవతరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభం

**కల్లూరు, మార్చి 17, ప్రభాతవార్త:** పదవతరగతి పబ్లిక్ పరీక్షలు-2025 సోమవారం నుండి ప్రారంభమయ్యాయి. ముఖ్యంగా కల్లూరు మండల పరిధిలో 18 పరీక్షా కేంద్రాలోల పరీక్షలు జరుగుతున్నాయి. కర్నూలు త్రీ, అండ్ ఫోర్తు టౌన్ మరియు ఉలిందకొండ పోలీస్‌స్టేషన్‌లో ప్రశ్న పత్రాలకు గట్టి భద్రత ఏర్పాట్లు చేశారు. అలాగే ఏ రోజు పత్రపత్రాలను ఆరోజు పోలీస్ ఎసా ్కర్ట్‌తో చీఫ్ సూపరింటెండెంట్‌లు మరియు డిపార్టుమెంట్ అఫీసర్లు పరీక్షా కే ంద్రాలకు తీసుకెళ్తారని ప్రతిరోజు ఉదయం 7.30 గంటలకు సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో సెట్ కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా విద్యాశాఖాధికారి శామ్యూల్ పాల్ మరియు ఆర్‌జెడి శామ్యూల్ చీఫ్ సూపరింటెండెంట్‌లకు ఫ్లయింగ్ మరియు సిటి ంగ్ స్క్వాడ్లకు ఆదేశాలు ఇస్తారు. కల్లూరు మండలంలో 3798 మంది విద్యార్థులకు గాను 3774 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని కల్లూరు మండల విద్యాధికారులు జి వనజ కుమారి, ఎం శ్రీనివాసులు తెలిపారు.

## సమస్యలు పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం విఫలం

**- డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న**

**పెద్దకడుబూరు, మార్చి 17, ప్రభాతవార్త :** ప్రజా సమస్యలు పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న, సిపిఎం మండల కార్యదర్శి తిక్కన్నలు విమర్శించారు. సోమవారం మండల కేంద్రమైన పెద్దకడుబూరులో ప్రజాచైతన్య యాత్ర నిర్వహించారు. స్థానిక ఎస్‌సి కాలనీలో ఆయా వార్డుల్లో పర్యటించి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏళ్ల తరబడి ప్రజలకు ఇబ్బందిగా మారిన పెద్ద నరసప్పబావిని తక్షణమే పూడ్చాలని డిమాండ్ చేశారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం నందు అపరిశుభ్రత తొలగించాలని, గ్రామానికి వారానికి మూడుసార్లు మంచినీటి సరఫరా చేయాలని, ఎస్ఎస్ ట్యాంక్ నందు ఫిల్టర్ బెడ్‌లను మార్చి మంచినీటి సరఫరా చేయాలన్నారు. సచివాలయం నందు ఉద్యోగులు ఇష్టానుసారంగా విధులకు హాజరవుతున్నారని విధుల పట్ల నిర్లక్ష్యం చేసే సచివాలయ ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం సచివాలయ సెక్రటరీకి వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు ఉప్పర ఈరన్న, చిన్నతుంబళం హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా పదవ తరగతి పరీక్షలు

**- వివిధ కారణాలతో 20మంది గైర్హాజరు**

**మంత్రాలయం, మార్చి 17, ప్రభాతవార్త:** మంత్రాలయం మండలంలో సోమవారం పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రార ంభమయ్యాయి. మంత్రాలయం పరిమళ పాఠశాల ఏ,బి కేంద్రాలు, మాధవరం సెయింట్ మార్తోమా ఇంగ్లిష్ మీడియం హైస్కూల్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లోవిద్యార్థులు తమ పరీక్షలు రాశారు. పరిమళ పాఠశాల ఏలో 319 మంది, బి కేంద్రంలో 314 మంది, మాధవరం సెయింట్ మార్తోమా హైస్కూల్‌లో 215 మంది, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 250మంది విద్యార్థులు హాజరయ్యారు. అయితే ఇందులో వివిధ కారణాలతో 20 మంది విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరయ్యారు. ఈ పరీక్ష కేంద్రాల్లో సిఐ రామాంజులు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

## కంప్యూటర్ సంభంధిత కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానం

**ఆలూరు, మార్చి 17, ప్రభాతవార్త:** స్తానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల నందు స్కిల్ హబ్ శిక్షణ కేంద్రంలో కంప్యూటర్ సంభంధిత కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్కిల్ హబ్ శిక్షణ కేంద్రం ప్రిన్సిపల్ రమాదేవి, నైపుణ్యాధికారి ఆనంద్ రాజ్‌కుమార్ తెలిపారు. సోమవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వమించే స్కిల్ హబ్ శిక్షణలో యువతి యువకులకు కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్ మరియు ఐటి హెల్ప్ డెస్క్ కోర్సులను అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు. అసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 20వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 90 రోజుల శిక్షణ కాలంలో కంప్యూటర్ స్కిల్స్, టైపింగ్ స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్, థియరీ కమ్యూనికేషన్ స్కిల్స్‌తో పాటు సిర్టిఫికెట్ అందజేయడం జరుగుతుందని వారు తెలిపారు. కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్ మరియు ఐటి హెల్ప్ డెస్కు కోర్సులకు ఇంటర్మీడియెట్, డిగ్రీ, డిప్లొమా, బీటెక్, ఎంబిఏ, పూర్తి చేసిన వారు అర్హులని తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు మరిన్ని వివరాల కోసం ఈ క్రింది ఫోన్ నెంబర్లకు 9010003132 సంప్రదించాలని తెలిపారు.

## ప్రజా సమస్యలను పరిష్కరించాలి : సిపిఎం

**పాములపాడు (రూరల్), మార్చి 17, ప్రభాతవార్త:**

గ్రామాలలో ప్రజా సమస్యలను అయా శాఖల అధికారులు, ప్రభుత్వం పరిష్కరించాలని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి సామన్న, నాయకులు వెంకటేశ్వర్‌రావు, ఎం రాజు, యేసేపు, జయరాజు, మధులు డిమాండ్ చేశారు. సోమవారం సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ప్రజా చైతన్యయాత్రలు నిర్వహించారు. అందులో భాగంగా పాములపాడు ఎస్సీ కాలనీలో నాయకులు పాదయాత్ర చేశారు. కాలనీలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎస్సీ కాలనీకి దూరంగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రానికి సీసీ రోడ్డు లేక చిన్నపిల్లలు ఇబ ్బందులుపడుతున్నారని అంగన్‌వాడీ టీచర్ వారి దృష్టికి తెచ్చినట్లు తెలిపారు. అదేవిధంగా ఎస్సీకాలనీలో ఉన్న పీర్లచావిడి బావిని మరమ్మత్తులు చేయాలని ప్రమాదాలకు గురికాకుండా కాంపౌండ్‌వాల్ నిర్మించాలని చింతకుంట నాగలక్ష్మి వారికి దృష్టికి తెచ్చినట్లు తెలిపారు. ఎస్సీకాలనీలో గ్రంధాలయాన్ని ఏర్పాటు చేయాలని సీసీ రోడ్లు, మంచినీటి సౌకర్యం, విద్యుత్ స్థంబాలు తదితర సమస్యలున్నట్లు భాస్కర్, నాగన్నలు వారి దృష్టితెచ్చినట్లు తెలిపారు. ఈసమస్యలపై అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కరించేందుకు సిపిఎం పార్టీ అధ్వర్యంలో పార్టీ పోరాటాలకు ప్రజలు ముందుకురావాలని వారు కోరారు.

## ఉన్నతమైన విద్యలో రానించాలని ఉచిత ఎంసెట్ కోచింగ్

**నందికొట్కూరు, మార్చి 17, ప్రభాతవార్త:**

ఎంతో ప్రతిభ కలిగిన పేద మధ్యతరగతి విద్యార్థులు సైతం ఉన్నతమైన విద్యలో రాణించాలని ఉచిత ఎంసెట్ కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేయడం మంచిదని దీనిని సద్వినియోగం చేసుకోవాలని సాయిరాం విద్యాసంస్థల చైర్మన్ సుధాకర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఏబివిపి ఆధ్వర్యంలో ఈ నెల 21 నుండి సాయిరాం కళాశాలలో ఏర్పాటు చేస్తున్న ఉచిత కోచింగ్ పోస్టర్లను చైర్మన్ విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతు నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు టెక్నికల్ కోర్సు వైపు ఇంజనీరింగ్ కోర్సు ఎంచుకుంటే తక్కువ సమయంలో ఉపాధి దొరికే అవకాశం ఉందని కావున ఇంటర్ పూర్తి అయిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏబివిపి నాయకులు యుగంధర్‌గౌడ్, భానుప్రకాష్‌రెడ్డి, ధనుంజయ్, ముజీబు, రేవంత్ తదితరులు పాల్గొన్నారు.

## పది పరీక్షల్లో 16 మంది గైర్హాజరు

**నందికొట్కూరు, మార్చి 17, ప్రభాతవార్త:** మండలంలో సోమవారం ప్రారంభమైన 10వ తరగతి పరీక్షల్లో మొత్తం 16 మంది విద్యార్థులు గైర్హాజరు అయినట్లు మండల విద్యాధికారి పి.సుభాన్ తెలిపారు. మొత్తం ఏడు పరీక్ష కేంద్రాలలో రెగ్యులర్, ప్రైవేట్ మరియు ఒకేషనల్ కోర్సులకు చెందిన 1607 మందికి గాను 16 మంది గైర్హాజర్ అయ్యారని ఆయన తెలిపారు. ఉదయం పరీక్ష కేంద్రాల వద్ద తమకు కేటాయించిన గదుల నెంబర్లను చూచేందుకు గుమికూడిన సకాలంలో అందరు గదులలోకి చేరుకున్నారు.

## పత్తికొండ ఎమ్మెల్యే కెఇ శ్యాంబాబుపై లేనిపోని ఆరోపణలు చేయడం తగదు

**- వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలి : జిల్లాతెదేపా నాయకులు సుబ్బరాయుడు**

**వెల్దుర్తి, మార్చి17, ప్రభాతవార్త :** పత్తికొండ నియోజకవర్గ ఎమ్మెల్యే కెఇ శ్యాంబాబుపై మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పత్తికొండలో పాత్రికేయుల సమావేశం ఏర్పాటుచేసి లేనిపోని ఆరోపణలు చేయడం తగదని, వాస్తవాలు తెలుసుకొని మాటా ్లడాలని జిల్లా తెదేపా నాయకులు సుబ్బరాయుడు అన్నారు. స్థానిక తెదేపా కార్యాలయంలో సోమవారం మండల తెదేపా అధ్యక్షులు టి.ఇ.బలరాంగౌడ్, క్రిష్ణగిరి మండల తెదేపా అధ్యక్షులు మర్రి శ్రీరాములు, ఆలంకొండ నబిసాహెబ్, మండల తెదేపా నాయకులు, కార్యకర్తలతో కలిసి సుబ్బరాయుడు పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బరాయుడుతో పాటు మర్రి శ్రీరాములు, ఆలంకొండ నబిసాహెబ్‌లు మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాల్లో గత ప్రభుత్వంలో జరిగిన అవినీతిపై విచారణ చేయమనడంతో మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి పాత్రికేయుల సమావేశం ఏర్పాటుచేసి ఏమేమో మాట్లాడుతున్నారన్నారు. మీ ప్రభుత్వంలో మీకు అసెంబ్లీలో మాట్లాడేందుకు సమయం వస్తే అప్పటి సిఎం జగన్‌మోహన్‌రెడ్డిని పొగిడారు కాని అభివృద ్ధిపై మాట్లాడలేదన్నారు. తెదేపా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ.15లక్షలతో సిసి రోడ్లు వేయిస్తున్నామన్నారు. మా తెదేపా ప్రభుత్వంలోనే సిసి రోడ్లు పూర్తిచేస్తామన్నారు. వెల్దుర్తి మండలానికి రూ.3.50కోట్ల రుపాయలతో సిసి రోడ్లు వేయిస్తున్నామన్నారు. మీరు రైతులకు అన్యాయం జరిగిందని ఆరోపిస్తున్నారన్నారు. మీరు మీ ప్రభుత్వంలో ఎన్నికలు దగ్గర పడుతున్న సమయంలో గత సిఎంతో హంద్రీనీవా కాలువ నుంచి చెరువులకు నీళ్లు మల్లించే పనులు ప్రారంభించారన్నారు. అయితే చెరువులకు పూర్తిస్థాయిలో నీళ్లు మల్లించలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పత్తికొండ ఎమ్మెల్యే కెఇ శ్యాంబాబు హంద్రీనీవా కాలువ నుంచి 68 చెరువులకు నీళ్లు మల్లించేలా చర్యలు తీసుకుంటున్నారన్నారు. పత్తికొండలో టమోట జ్యూస్ ఫ్యాక్టరీ ప్రారంభించింది మేమే అంటున్నారు. మీ ప్రభుత్వంలో ఎన్నికలు సమీపిస్తున్న 1 సంవత్సరం ముందు మీ నాయకుడు ఎక్కడో ఉండి ప్రారంభించిన పూర్తి కాలేదన్నారు. నేడు పత్తికొండ ఎమ్మెల్యే కెఇ శ్యాంబాబు టమోట రైతుల మేలుకై జ్యూస్ ఫ్యాక్టరీ పనులు ప్రారంభిస్తుంటే ఓర్వలేక మీరు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాతెదేపా నాయకులు సుబ్బరాయుడు, మండల తెదేపా అధ్యక్షులు టి.ఇ.బలరాంగౌడ్, క్రిష్ణగిరి మండల తెదేపా అధ్యక్షులు మర్రి శ్రీరాములు, ఆలంకొండ నబిసాహెబ్, మండల తెదేపా నాయకులు నర్సాపురం రాజేశ్వరరెడ్డి, యల్.నగరం మహీధర్‌రెడ్డి, రామళ్లకోట రామస్వామి, సూదేపల్లి రామాంజనేయులు, కలుగోట్ల సర్పంచ్ మద్దిలేటి, నర్సాపురం రాముడు, చంద్ర, సుబ్బారెడ్డి, లక్ష్మీనాథ్, రాంబాబు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



## చందన షాపింగ్ మాల్ యజమాన్యంపై చర్యలు తీసుకోవాలి.

**ఆదోని మార్చి17 ప్రభాతవార్త :** ఆదోని పట్టణంలో చందన షాపింగ్ మాల్ ప్రారంభోత్సవం సందర్భంగా ట్రాఫిక్ సమస్యతో ప్రజలకు ఇబ్బందులకు గురి చేసిన షాపింగ్ మాల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సిపిఎం పట్టణ కార్యదర్శి లక్ష్మన్న, సిపిఐ పట్టణ కార్యదర్శి సుదర్శన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేవిశెట్టి ప్రకాష్, తదితరులు సబ్ కలెక్టర్ కి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. వీరు మాట్లాడుతూ ఈరోజు చందన షాపింగ్ మాల్ ప్రారంభం సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ప్రధాన రోడ్డు మొత్తం పూర్తిగా రాకపోకలను పోలీసు వారు అధికారులు దగ్గరుండి బంద్ చేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని వారు తెలిపారు. మండుటెండలో సుమారు ఐదు గంటల పాటు ట్రాఫిక్ సమస్యతో ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి దగ్గర నుండి ఆర్ట్స్ కాలేజ్ రోడ్డు రిలయన్స్ ట్రెండ్ వరకు ప్రజలు, విద్యార్థులు, వాహనదారులు, నరకయాతన పడ్డారని వారు తెలిపారు. ఆదోని పట్టణానికి షాపింగ్ మాల్ లాంటివి రావడం మంచిదే అయినప్పటికీ ఈ రకంగా ప్రజలను ఇబ్బందులకు గురి చేయడం సరైనది కాదని వారు తెలిపారు. మాల్ ప్రారంభోత్సవం సందర్భంగా ప్రజలను ఇబ్బందులు గురిచేసిన చందన షాపింగ్ మాల్ యజమాన్యం పై చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

## త్రాగునీటి సమస్య పరిష్కరించండి.

**: గణేకల్లు గ్రామ సచివాలయంకు తాళం.**

**ఆదోని రూరల్ మార్చి 17 ప్రభాతవార్త :** ఆదోని మండలం గణేకల్లు గ్రామంలో త్రాగునీటి సమస్య పరిష్కరించాలని కోరుతూ సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఖాళీ బిందెలతో సచివాలయం ముట్టడించి సచివాలయానికి తాళం వేయడం జరిగింది. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి గారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది అనంతరం సిపిఎం పార్టీ మండల కార్యదర్శి వర్గ సభ్యులు బి వీరారెడ్డి మాట్లాడుతూ గత 15 రోజులుగా కుప్పగల్లు ఎస్ ఎస్ ట్యాంక్ ద్వారా త్రాగునీరు సరఫరా చేయకుండా అధికారులు తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారని, అదేవిధంగా గ్రామంలో పంచాయతీ మోటార్ నుంచి నాలుగు సిస్టెన్సులకు నీటి సరఫరా సరిగా చేయకపోవడం, ఉన్న పైప్లైన్లకు లీకేజలను సరి చేయకపోవడం వల్ల గ్రామ ప్రజలు త్రాగునీరు దొరకక ప్రజలు బోరు బావుల్ని ఆశ్రయించి నీళ్ల తెచ్చుకోవాల్సి న దుస్థితి ఏర్పడిందన్నారు. గతంలో ఎన్నోసార్లు అధికారులకు ప్రజా ప్రతినిధులకు విన్నవించినా సమస్యను పరిష్కరించడంలో అధికారులు పూర్తిగా విఫలం చెందారన్నారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ అధికారులు వెంటనే జోక్యం చేసుకొని గణేకల్లు గ్రామానికి త్రాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి ఫెడరేషన్ నాయకులు పరమేష్, మరియు రంగస్వామి, సిపిఎం పార్టీ సభ్యులు మల్లయ్య, బంగారయ్య రామాంజనేయులు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పట్టణంలో నీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలి

**నందికొట్కూరు, మార్చి 17, ప్రభాతవార్త:**

వేసవి తీవ్రంగా ఉండడం వలన పట్టణంలో నీటి తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని మున్సిపల్ సిబ్బందికి కమీషనర్ ఎస్.బేబి తెలిపారు. సోమవారం కమీషనర్ బైరెడ్డి నగర్‌లోని సమ్మర్ స్టోరేజిని పరిశీలించి మరమ్మత్తులు ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని నీటి సమస్య ఉండకూడదని ఆమె సూచించారు. అనంతరం కమీషనర్ పట్టణంలో విస్తృంగా పర్యటించి పారిశుధ్యం పనులలో జరుగుతున్న పనులను పరిశీలించి మురుగు కాలువలలో చెత్తచెదారంతో ఉండడంతో ఆమె వెంటనే తొలగించాలని కార్మికులను ఆదేశించి క్లీన్ చేయించారు. వ్యాపారస్తులు, హోటళ్ళ నిర్వాహకులు చెత్తను కాలువలో వేయకూడదని, నిర్ణయించిన ప్రదేశంలోనే వేయాలని అందుకు వ్యతిరేకంగా ఎక్కడ పడితే మున్సిపల్ నిభంధనల మేరకు తగు చర్యలు తీసుకోబడుతాయని కమీషనర్ హెచ్చరించారు. కాలనీలో ఉన్న వారి పారిశుధ్యం, నీటి సమస్యను అడిగి తెలుసుకున్నారు. అలాగే సంతమార్కెట్‌లో ఉన్న అన్న క్యాంటీన్ పరిశీలించి పరిశుభ్రత పాటించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో డి.ఇ.నాసిర్, ఏ.ఇ.దినేష్ తదితరులు పాల్గొన్నారు,

## వడదెబ్బ తగలకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలి

**- జిల్లా సంచార చికిత్స అధికారి రఘు**

**మంత్రాలయం, మార్చి17, ప్రభాతవార్త:** ప్రస్తుతం ఎండాకాలం ప్రారంభమయినందున ప్రజలు వడదెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా సంచార చికిత్స కార్యక్రమ అధికారి డా.రఘు అన్నారు. సోమవారం మండల పరిధిలోని కల్లుదేవకుంట గ్రామంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆసుపత్రిలో ఉన్న రికార్డులను పరిశీలించారు. ప్రజలకు అందుతున్న వైద్యసేవలను మండల వైద్యాధికారి డా.గోవిందమ్మను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చిలకలడోణ గ్రామంలో జరుగుతున్న అసంక్రామిత వ్యాధుల సర్వేను పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవజాత శిశువులు, చిన్నపిల్లలు, గర్భిణీస్త్రీలు, పాలిచ్చే తల్లులు, ఆరుబయట పనిచేసే వ్యక్తులు మానసిక అనారోగ్యంతో ఉన్న వ్యక్తులు, కార్మికులు, రైతులు వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. చెప్పులు లేకుండా బయట తిరగవద్దన్నారు. తీవ్రమైన వడదెబ్బకు గురయిన వ్యక్తిని 108 వాహనంలో సమీపంలో ఉన్న ఆసుపత్రికి తరలించి వైద్యం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య అధికారిణి వెంకటలక్ష్మి సిబ్బంది తులసి, భారతి, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

## అట్టహాసంగా సాగిన బండలాగుడు పోటీలు

**- పోటీలను ప్రారంభించిన నంద్యాల జిల్లా టిడిపి ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి.ఫిరోజ్**

**నంద్యాల, మార్చి 17, ప్రభాతవార్త ప్రతినిధి:**

ఓర్వకల్లు మండలం కాల్వగ్రామంలో హజరత్‌సయ్యద్ మహమ్మద్ షాఖాద్రి స్వాముల వారి ఉరుసు మహోత్సవం సందర్భంగా గురువులు సయ్యద్‌షహబుద్దీన్‌షాఖాద్రి, సయ్యద్ ఖమర్‌షాఖాద్రి వారిచే కాల్వ గ్రామ టిడిపి అధ్యక్షులు రజాక్‌బాష ఆధ్వర ్యంలో పాలపండ్ల వృషభరాజముల బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన నంద్యాల జిల్లా టిడిపి ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి.ఫిరోజ్ పోటీలను ప్రారంభించారు. అనంతరం హజరత్‌సయ్యద్ మహమ్మద్‌షాఖాద్రి స్వాములవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## ఏఎన్ఎం గ్రేడ్-3లకు ఎంపిహెచ్ఏ పదోన్నతుల కౌన్సిలింగ్

**కర్నూలు హాస్పిటల్, మార్చి 17, ప్రభాతవార్త:** కర్నూలు మెడికల్ కళాశాల ఆడిటోరియం నందు 175 మంది ఏఎన్ఎం గ్రేడ్-3లకు ఎంపిహెచ్ఏ ఎఫ్ పదోన్నతుల కొరకు ఈనెల 18న కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అర్హుల జాబితా మరియు ఖాళీల వివరాలను వెబ్‌సైట్ నందు ఉంచడం జరిగింది. వారు సర్వీసు రిజిష్టర్ మరియు ప్రయారిటి సర్టిఫికెట్‌లు తీసుకొని రావాలని జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి తెలిపారు.



## డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలి

**-రాష్ట్ర బడ్జెట్‌లో నిరుద్యోగ భృతికి నిధులు కేటాయించాలి**

**కర్నూలు విద్య, మార్చి 17, ప్రభాతవార్త:** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తొలి సంతకం డిఎస్సీ కోసం చేసి డిఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వడం మరిచిపోయారని వెంటనే డిఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కె శ్రీనివాసులు డిమాండ్ చేశారు. డిఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని రాష్ట్ర బడ్జెట్‌లో నిరుద్యోగ భృతికి నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తు అఖీల భారత యువజన సమాఖ్య ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి పిలుపుమేరకు కర్నూలు జిల్లా సమితి అధ్వర ్యంలో కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. కార్యక్రమానికి ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు శ్రీరాములు అధ్యక్షత వహించగా ఈధర్నాను ఉద్దేశించి ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కె శ్రీనివాసులు మాట్లాడుతూ 2024 ఎన్నికలకు ముందు వైసీపీ ప్రభుత్వం డిఎస్సీ అభ్యర్థులను పూర్తిగా మోసం చేసిందని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ముఖ్యమంత్రిగా మొదటి సంతకం డిఎస్సీపైనే చేస్తానని హామి ఇవ్వడమే కాకుండా ప్రతి సంవత ్సరం డిఎస్సీ నోటిఫికేషన్ ఇస్తామని అధికారం చేపట్టి 9 నెలలు గడుస్తున్నా సంతకాలకే పరిమితమయ్యారే తప్ప ఇంతవరకు ఇంతవరకు డిఎస్సీ నోటిఫికేషన్ గురించి కూటమి ప్రభుత్వం మాట్లాడకపోవడం సిగ్గుచేటన్నారు. ఈకార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు హనుమేష్, సహాయకార్యదర్శులు బీసన్న, జాఫర్, వినోద్, నగర అధ్యక్షులు నాగరాజు , నాయకులు శ్రీకాంత్, చంటి, మధు, శీను, శివ, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేదలకు 500 ఈద్ కిట్ల పంపిణీ

**నంద్యాల, మారి ్చ 17, ప్రభాతవార్త**

తాహెరా హెల్త్ అండ్ ఎడు ్యకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో నంద్యాల నడిగడ్డ రాయల్ ఇంగ్లీషుమీడియం స్కూల్ యాజమాన్యం వారు డా.వి.యాకూబ్, ఆయన సోదరులు వి.ఇసాక్‌వలిలు రంజాన్ సందర్భంగా నిరుపేదలకు జకాత్ రూపంలో 500 ఈద్‌కిట్లను పంపిణీ చేశారు. అనంతరం డా.వి.యాకుబ్, అతవుల్లాఖాన్‌లు మాట్లాడుతూ ఇస్లాం ధర్మానుసారం సంపాదించిన మొత్తం నుంచి జకాత్ రూపంలో తీసిన డబ్బుతో గత పన్నెండు సంవత్సరాలుగా నిరుపేద కుటుంబాలకు ఈద్ కిట్లను ఆనవాయితీగా పంపిణీ చేస్తున్నామన్నారు. తదా ్వరా పేద కుటుంబాలు అందరిలాగే పండుగను జరుపుకొంటారని వారు తెలిపారు. ప్రముఖ ముస్లిం మతపెద్దలు మౌలానాఅబ్దుల్‌హాది మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా వీరు చేస్తున్న సేవలను కొనియాడుతూ భగవంతుడైన అల్లా ఆశీస్సులు ఉండాలని ఆకాక్షించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యఅతిథి ముస్లింమతపెద్దలు అబ్దుల్‌హాదీ, ఎస్‌డిపిఐ పార్లమెంటు నాయకులు అతవుల్లా, ఎస్‌డిపిఐ నంద్యాల పట్టణ అధ్యక్షులు ఏజాజ్, ఫరీఫ్‌ల చేతులమీదుగా ఈద్గా కిట్లను నిరుపేదలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాయల్, నారాయణ స్కూల్ అధినేత ఇసాక్‌వలి, ఖాజాహుసేన్, యూసుబ్, నవభారత్ హుస్సేన్, సాయివాణి సూ ్కల్ కరస్పాండెంట్ హుసేన్‌బాష, ఉపాధా ్యయినీ ఉపాధ్యాయులు , బంధుమిత్రులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా

**కర్నూలు విద్య, మార్చి 17, ప్రభాతవార్త:**

స్థానిక క్లస్టర్‌యూనివర్శిటి పరిధిలోని బి క్యాంపులోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో జవహర్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో ఈనెల 18న 1 అండ్ 2 న్యూయోలైని టెలికమ్యూనికేషన్, డైకిన్ ఏసీ మ్యానిఫ్యాక్చరింగ్ కంపెనీ, ఎలక్ట్రానిక్ మొబైల్ కంపెనీ (ఎంఎస్‌సి) కంపెనీల వారు ఎస్ఎస్‌సి, ఇంటర్మీడియేట్, డిప్లొమో, ఐటిఐ, డిగ్రీ పాస్/ఫెయిల్ అభ్యర్థులకు అపరేటర్ ఉద్యోగాల కొరకై మెగా జాబ్‌మేళాను నిర్వహిస్తున్నారు. అసక్తిగల అభ్యర్థులు తమ బయోడెటా మార్కుల జాబితా, అధార్‌కార్డులతో కళాశాలలో ఉదయం 10 గంటలకు హాజరుకావాలని ప్రిన్సిపాల్ ఎం ఇందిరాశాంతి జెకెసి సమన్వయకర్త డా.ఎం మాదన్న పత్రికా ప్రకటనలో తెలిపారు. వివరాలకై 6300473785 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలన్నారు.

# ప్రజా సమస్యలను వేగవంతంగా పరిష్కరించండి

: పి.జి.ఆర్.ఎస్ వచ్చిన అర్జీలను గడువు లోపు పరిష్కారం అయ్యేటట్టు చర్యలు తీసుకోండి.
: అర్జీలను నాణ్యతగా పరిష్కరించండి.ఆదోని సబ్ కలెక్టర్



**ఆదోని, మార్చి 17 ప్రభాతవార్త:**
పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం పిజిఆర్ఎస్ కార్యక్రమంలో వచ్చిన అర్జీలను ఏ ఒక్క అధికారి నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించి అర్జీదారులను సంతృప్తిపరిచేలా చూడాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ పేర్కొన్నారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం నందు పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం పిజిఆర్ఎస్ లో సబ్ కలెక్టర్ పాల్గొని డివిజన్లోని ఆయా మండలాల నుంచి వచ్చిన ప్రజల నుండి వచ్చిన అర్జీలను స్వీకరించారు. .మండలంలోని ఆయా శాఖల అధికారులకు సంబంధించిన సమస్యలను తెలియజేస్తూ గడువు లోపు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాల న్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బియాండ్ ఎస్ ఎల్ ఏ లోకి వెళ్లకుండా చూడాలన్నారు. మండలాల నుంచి వచ్చిన సమస్యలు కొన్ని. :1. ఆదోని మండలం పెద్ద హరివనం గ్రామానికి చెందిన గర్జప్ప సంబంధించి సర్వేనెంబర్ 844/ఏ2 నందు 84 సెంట్ల భూమి వారసత్వంగా సంక్రమించినది. సదరు భూమి ఆన్లైన్ నందు నమోదు చేసి పట్టాదారు పాసుపుస్తకం మంజూరు చేయవలసినదిగా అర్జీ సమర్పించుకున్నారు. 2. టి.బి.పి ద్వారా ఎల్.ఎల్.సి కింద రబి పంటలకు మార్చి 31వ తేదీ వరకు సాగునీరు అందిస్తామని ఎల్ఎల్సి అధికారులు నిర్ణయించారు. ప్రస్తుతం వివిధ కారణాల వలన సరైన సమయానికి పంట చేతికి రావడం ఇబ్బందిగా ఉన్నది కావున ఏప్రిల్ చివరి వరకు సాగునీరు అందించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం సంబంధించి కర్నూలు జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర్లు అర్జీ సమర్పించుకున్నారు. 3. ఆదోని పట్టణానికి చెందిన నాగరత్నమ్మ కూతురు చిత్ర పుట్టుకతోనే దివ్యాంగురాలను, మంచానికే పరిమితం అయిందని. విచారణ చేసి దివ్యాంగుల పెన్షన్ బదులుగా అదనపు పెన్షన్ మంజూరు చేయవలసినదిగా నాగరత్నమ్మ అర్జీ సమర్పించుకున్నారు. 4. హోలగుంద మండలం వంద వాగిలి గ్రామానికి చెందిన హనుమంతమ్మ కు సంబంధించి సర్వే నెంబర్ 162 హెచ్ నందు 2.25 ఎకరాల భూమి ఉన్నది. ప్రస్తుతం సదరు భూమి ఆన్లైన్ నందు నమోదు చేయవలసినదిగా అర్జీ సమర్పించు కున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఇన్స్పెక్టర్ సర్వ్యాయర్స్ శ్రీనివాసరాజు, వేణు సూర్య, డిఎల్పిఓ నూర్జహాన్, డి ఎల్ డి వో రమణారెడ్డి, ఆర్డబ్ల్యూఎస్ ఈ.ఈ పద్మజ, ఆర్ అండ్ బి డిప్యూటీ ఇంజనీర్ వెంకటేశ్వర్లు, ఆర్టీసీ డిపో మేనేజర్ మహ్మద్ రఫీ, డిప్యూటీ డిఎంహెచ్వో సత్యవతి, ఉప తహశీల్దారు గుండాల నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# రహదారుల విస్తరణ మరమ్మత్తులకు.. అనుమతులు ఇవ్వండి

: విజయవాడలో ఎన్హెచ్ఏఐ రీజనల్ అధికారి రాకేష్‌ను కలసిన ఎంఎల్ఏ



**ఆత్మకూరు, మార్చి17, ప్రభాతవార్త:**
నల్లమల అటవీ ప్రాంతంలోని శ్రీశైలం నియోజకవర్గంలో రహదారుల విస్తరణ మరమ్మత్తుల పనులు చేపట్టేందుకు నేషనల్ హైవే ఆథారిటి రీజినల్ రాష్ట్ర అధికారి రాజేష్‌కుమార్‌ను సోమవారం శ్రీశైలం నియోజకవర్గం ఎంఎల్ఏ బుడ్డా రాజశేఖరరెడ్డి విజయవాడలో అభివృద్ధి రహదారి పనులపై ప్రత్యేకించి చర్చించారు. ముందుగా శ్రీశైలంలో జరగబోయే ఉగాది బ్రహ్మోత్సవాలకు మర్యాద పూర్వకంగా మల్లికార్జున బ్రహ్మరాంభిక స్వామి అమ్మవార్ల పట్టువస్త్రాలు ఇచ్చి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శ్రీశైలం నియోజకవర్గం ఎంఎల్ఏ బుడ్డా రాజశేఖరరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రముఖ పుణ్యక్షేత్రాలు నల్లమల అటవీ ప్రాంతంలో పరిధిలో ఆత్మకూరు నుంచి దోర్నాల వరకు రహదారి విస్తరణ పనులకు అనుమతులు ఇవ్వాలని విన్నవించారు. అలాగే నల్లకాల్వ నుంచి – వెలుగోడు వరకు అడవి మార్గంలో రహదారి విస్తరణ మరమ్మతుల పనులకు అవకాశం కల్పించే విదంగాచొరవ తీసుకోవాల న్నారు. దేశంలోనే ఎంతో ప్రసిదిగాంచిన శ్రీశైలం పుణ్యక్షేత్రం మహనంది, ఒంకారంతో పాటు పలు పుణ్యక్షేత్రాలు నల్లమలలోనే కొలువైయాని వివరించారు. ఈ ఆలయాలో వెలసిన దేవుళ ఆశీస్సుల కోసం ఇతర రాష్ట్రాల నుంచి భక్తాదులు అధిక సంఖ్యలో తరలి వస్తున్నారన్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని రాయలసీమ ముఖ ద్వారం కర్నూలు నుంచి గుంటూరు వరకు నేషనల్ హైవే జాతీయ రహదారి 340సి పనులు శరవేగంగా కొనసాగుతున్న విషయాని అధికారికి గుర్తు చేశారు. ఈ నేపధ్యంలోనే రెండు తెలుగు రాష్ట్రాల నుంచి మరో జాతీయ రహదారి విస్తరణ పనులు ప్రారంభం కాబోతున్న సమయంలో 167కే జాతీయ రహదారి విస్తరణ పనులు జరుగుతున్న విషయాని ప్రత్యేకించి చర్చించారు. వీటిన్నంటిని దృష్టిలో ఉంచుకోని నల్లమల అటవీ ప్రాంతంలో భక్తులకు ప్రయాణికులకుతో పాటు రోడ్డు ప్రమాదాలు నివారించే విదంగా విస్తరణ మరమ్మత్తుల పనులకు అనుమతులు ఇవ్వాలని శ్రీశైలం ఎంఎల్ఏ బుడ్డా రాజశేఖరరెడ్డి నేషనల్ హైవే ఆథారిటి రిజినల్ అధికారి రాకేష్‌కుమార్‌కు శ్రీశైలం నియోజకవర్గ సమస్యలు విన్నవించారు.

## విమానాశ్రయానికి ఉయ్యాలవాడ నరసింహారెడ్డి పేరు పెట్టండి

– నంద్యాల ఎంపి డా.బైరెడ్డిశబరి

**నంద్యాల, మార్చి 17,ప్రభాతవార్త ప్రతినిధి**



నంద్యాల జిల్లా ఓర్వకల్లు విమానాశ్రయానికి స్వాతంత్ర్య సమర యోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి పేరు పెట్టాలని భారత పౌర విమానాయాన శాఖ మంత్రి కింజారపు రాంమోహన్ నాయుడు కును ఆయన కార్యాలయంలో నంద్యాల ఎంపి, లోకసభ టిడిపి డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డా.బైరెడ్డిశబరి మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత వైకాపా ప్రభుత్వం నంద్యాల జిల్లా ఓర్వకల్లు విమానాశ్రయానికి ఉయ్యాలవాడ నరసింహారెడ్డి పేరు పెడతామని చెప్పి పెట్టకుండ రాయలసీమ ప్రజలను విస్మరించి విమర్శలు చేశారన్నారు. బ్రిటిష్‌వారిపై తిరగబడ్డ తొలి స్వాతంత్ర్యసమరయోధుడు ఉయ్యాలవాడనరసింహారెడ్డి పేరు ఓర్వకల్లు విమానాశ్రయానికి పెట్టాలని ఎంపి కేంద్రమంత్రిని కోరారు. కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించడం పట్ల బైరెడ్డిశబరి ధన్యవాదాలు తెలియజేశారు.

## పొగాకు బేళ్లు దగ్ధమైన ఘటన పై పోలీసుల విచారణ



**బనగానపల్లె, మార్చి17, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని కాపులపల్లె గ్రామంలో ఆదివారం మధ్యాహ్న సమయంలో జరిగిన అగ్నిప్రమాద ఘటనలో గ్రామానికి చెందిన నెమలి వెంకటకృష్ణయ్య అనే వ్యక్తికి చెందిన పొగాకు ఎండబెట్టేందుకు కట్టిన దోరణాలు దగ్ధమైన ఘటన పై సోమవారం సీఐ ప్రవీణ్ కుమార్ నేతృత్వంలో ఎస్ఐ దుగ్గిరెడ్డి, పోలీసులు గ్రామానికి చేరుకుని అగ్ని ప్రమాద ఘటన పై విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ ప్రవీణ్ కుమార్ గ్రామస్తులందరిని విచారించి గ్రామసభను ఏర్పాటుచేసి ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల పై గ్రామస్తులకు వివరించారు. ఆదివారం మధ్యాహ్న సమయంలో జరిగిన ఘటనలో ఎండబెట్టిన పొగాకు దోరణాలు తగలబడడంతో రూ.1.50లక్షలు పంటనష్టం జరిగినట్లు బాధితుడు నెమలి వెంకటకృష్ణయ్య ఇది వరకే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎడమకంటి తులసిరెడ్డి, బాధితుడు, గ్రామ ప్రజలు, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

## గద్దెరాళ్ల మారెమ్మవ్వ దేవరకు భారీ బందోబస్తు

– బందోబస్తుకు 200 మంది పోలీసు సిబ్బంది
– ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు తీసుకుంటాం : సీఐ

**దేవనకొండ, మార్చి17, ప్రభాతవార్త;**
మండలంలోని గద్దెరాళ్ల గ్రామంలో కొలువైన గద్దెరాళ్ల మారెమ్మవ్వ దేవర మహోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్న దృష్ట్యా భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సీఐ వంశీనాథ్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 200 మందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇందులో ఒకరు డీయస్పీ, ఆరు మంది సీఐలు, ఎస్ఐలు 15 మంది, ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, ఉమెన్ పోలీసులు, హోంగార్డులు, పోలీసు సిబ్బంది, స్పెషల్ పార్టీ పోలీసులతో కలిపి మొత్తం 200 మంది బందోబస్తులో ఉంటారన్నారు. ట్రాఫిక్ సమస్య లేకుండా పోలీసుశాఖ చర్యలు తీసుకుంటుందన్నారు. ఉత్సవాల్లో పాల్గొనే భక్తులు ప్రశాంతంగా అమ్మవారిని దర్శించుకోవాలని సూచించారు.

## మెరుగైన వైద్యసేవలు అందించాలి



**కర్నూలు హాస్పిటల్, మార్చి 17, ప్రభాతవార్త:**
ఎమర్జెన్సీ విభాగాలకు వచ్చే పేషెంట్లకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డా.వెంకటేశ్వర్లు వైద్యులకు ఆదేశించారు. సోమవారం వైద్ య్శాల లోని పలు విభాగాలైన క్యాజువాలిటి, సైకియాట్రి, డెంటల్, మెడికల్ ఓపి, సర్జికల్ డెర్మటాలజి, ఈఎన్‌సి తదితర ఓపి విభాగాలను అకస్మిక తనిఖీచేసినట్లు తెలిపారు. ఎమర్జెన్సీ విభాగం తనిఖీ సమయంలో విధి నిర్వహణలో లేని అసిస్టెంట్ ప్రొఫెసర్లపై అగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఎమర్జెన్సీ డిపార్టుమెంట్ మరియు జనరల్ సర్జరీ విభాగపు అసిస్టెంట్ ప్రొఫెసర్ మెమో ఇష్యు చేసినట్లు తెలిపారు. ఆసుపత్రిలోని పలు ఓపి విభాగాల్లో ఈ హాస్పిటల్ ఇంప్లిమెంటేషన్ పనితీరు గురించి ఆరాతీశారు. కార్యక్రమానికి హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్స్ డా.శివబాల నగాంజన్, డా.కిరణ్‌కుమార్ మరియు ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనలు గాలిలో.. సిసి రోడ్డు నిర్మాణములో..నాణ్యతకు తిలోదకాలు..?

: క్వాలిటీ కంట్రోల్ అధికారులు కాస్త చెక్ చెయ్యరూ..?



**నంద్యాల, మార్చి 17,ప్రభాతవార్తప్రతినిధి**
బిటి రోడ్డు అంటే ఎలా ఉన్నా వాటిని మరమ్మత్తు రూపములో ఎలాగో సరి చేయడము జరుగుతుంది కాని సిసి రోడ్డుకు నిర్మాణము అలా కాకుండా నిబందనల ప్రకారమ వైట వాచ్ వేసిన మిక్సింగ్ వేసిన పిదప రెండు వారాలు పాటు అది గట్టి పడే వరకు తిరిగి సిసిరోడ్డు వేయరాదని తెలుస్తోంది, కాని ఇక్కడ లక్షలు విలువ చేసే సిసి రోడ్డు నిర్మాణము చేస్తు నిబందనలు తుంగ తొక్కి వైట్ మిక్సింగ్ వేసిన వెంటనే సిసి రోడ్డు నిర్మాణము చేస్తున్నారని కాలనీ వాసులు అంటున్నారు. నంద్యాల పట్టణంలోని యస్‌బిఐ కాలనీలోని రామకృష్ణ పిజి కాలేజి వద్ద సిసి రోడ్డు నిర్మాణము చేస్తున్నారు. అయితే ఇటీవల రోడ్డు నిర్మాణము కోసం ముందుగా వైట్ మిక్సింగ్ వేశారు అయితే నిబందనల ప్రకారము వైట మిక్సింగ్ వేసిన పిదప దాదాపు ఎందువారాలైన సిసిరోడ్డు వేయకుండా ఉండాలని నిబందన ఉన్నట్లు సమాచారము అయితే వాటిని తుంగ తొక్కి వైట్ మిక్సింగ్ వేసిన వెరువెంటనే తిరిగి పూర్తి సిసిరోడ్డు నిర్మాణమునకు ఉపయోగించే కంకర, ఇసుక కలిపి సిసిరోడ్డు వేస్తున్నారని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. దానిని అలాగే వేస్తే పట్టుమని రెండు సంవత్సరాలుగా కూడా నిలువ కుండ సిసిరోడుక్డ మొత్తం రెండుగా



చీలుతుందని కాలనీ వారు తమ అవాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కేంద్రములోనే ఇలా చేస్తుంటే ఇక గ్రామీణ ప్రాంతాలో కథదేవుడు ఎరుక ఇలా చేస్తు్ను సంబందిత అధికారులు మాత్రము శోద్యము చూస్తున్నారని అంటున్నారు. దీనినిన క్వాలిఇటీ కంట్రోల్ అధికారులు చెక్ చేస్తే బండారము బయట పడుతుందని కావున క్వాలిటీ కంట్రోల్ అధికారులు యస్‌బిఐ కాలనీలో రామకృష్ణ పిజి కాలేజి వద్ద చేస్తున్న సిసి రోడ్డు నిర్మాణ పనులు చెక్ చేయాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

## ప్రాధాన్యత క్రమంలో వసతుల కల్పన

– నగరపాలక కమిషనర్ ఎస్ రవీంద్రబాబు



**కర్నూలు మునిస్పల్, మార్చి 17, ప్రభాతవార్త:**
నగరంలో వివిధ కాలనీల్లో మౌలిక వసతులను ప్రాధాన్యత క్రమంలో కల్పిస్తామని నగర పాలక కమిషనర్ ఎస్ రవీంద్రబాబు అన్నారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిషాఱ్కర వేదిక కార్యక్రమానికి 12 అర్జీలు రాగ వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అర్జీదారులకు తెలిపారు. ప్రజాఫిర్యాదుల పరిష్కారవేదికలో వచ్చిన కొన్ని అర్జీలు గురుకుల్ పాఠశాల సమీపంలోని ఎన్జీవోస్ కాలనీలో రహదారులు, మురుగుకాల్వలు నిర్మించాలని స్థానికులు పి షాషా వలి, ఖాదర్, శ్రీనివాసులు విన్నవించారు. ఓమెగా హాస్పిటల్ సమీపంలోని క్రిష్ణాజీరావు కాలనీలో తాగునీటి సమస్య, రహదారులు, మురుగుకాల్వల నిర్మాణం చేపట్టాలని స్థానికులు నాగరాజు, వెంకటేశ్వర్లు కోరారు. తన ఇంటి ముందు పూడికతీత వ్యర్థాలను తొలగించాలని మేడం వారి వీధికి చెందిన సి రాజన్ బాబు విన్నవించారు. ఈకార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్‌జివి క్రిష్ణ, మేనేజర్ ఎన్ చిన్నరాముడు, ప్రజారోగ్యాధికారి కె విశ్వేశ్వర్‌రెడ్డి, ఎస్ఈ రాజశేఖర్, సిటి ప్లానర్ ప్రదీప్‌కుమార్, ఎంఈ సత్యనారాయణ, పారిశుద్ధ్యపర్యవేక్షక అధికారి నాగరాజు, సూపరింటెండెంట్లు క్రిస్టోఫర్, వాజిద్, టీడ్కో అధికారి పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

## పదవ తరగతి పరీక్షలను పర్యవేక్షించిన ఎస్సై

**మిడుతూరు మార్చి 17 ప్రభాతవార్త:**



మండల కేంద్రమైన మిడుతూరులోని మోడల్ పాఠశాల, జడ్పీ పాఠశాల లో నిర్వహిస్తున్న పదవ తరగతి పరీక్షా కేంద్రాలను ఎస్ఐ ఓబులేసు తన సిబ్బందితో పర్య వేక్షించారు. పాఠశాల ఆవరణలో ఎవరు రాకుండా, పరీక్షలు రాసే విద్యార్థులకు ఎలాంటి ఆటంకం ఇబ్బందులు కలవకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్సై చెప్పారు.

## అసెంబ్లీ కార్యాలయ సబార్డినేట్ కోటేశ్వరమ్మను సత్కరించిన మహిళా ఎంఎల్ఏలు



**నంద్యాల, మార్చి 17, ప్రభాతవార్త ప్రతినిధి**
ఏపి శాసనసభ కార్యాలయంలో సబార్డినేట్‌గా పనిచేస్తున్న పి.కోటేశ్వరమ్మ ఏప్రిల్ 30న పదవీవిరమణ చేయనున్నారు. ఈ సందర్భంగా శాసనసభ కార్యాలయంలో ఆళ్లగడ్డ ఎంఎల్ఏ భూమాఅఖిలప్రియ, మహిళా ఎంఎల్ఏలు ఆమెను శాలువతో సత్కరించి దుస్తులు అందజేశారు.

## డిక్లరేషన్ ఫాం అందుకున్న టీడీపి ఎమ్మెల్సీ బిటీ నాయుడు



**కర్నూలు హాస్పిటల్, మార్చి 17, ప్రభాతవార్త:**
ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవల రెండో సారి ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ గా ఏకగ్రీవంగా ఎన్నికైన ఎమ్మెల్సీ బీటీ నాయుడుకు డిక్లరేషన్ ఫాం (దృవీకరణ పత్రం)ను ఎన్నికల ప్రధాన వనితా రాణి అందజేశారు. ఈసందర్భంగా ఆయన మరోమారు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు, మంత్రి నారా లోకేష్ రాష్ట్ర ప్రభుత్ వ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో శాసనమండలి చీఫ్ విఫ్ పంచుమర్తి అనురాధ, విఫ్‌లు కంచర్ల శ్రీకాంత్ చౌదరి, వెంపాడ చిరంజీవి, టిడిపి ఎమ్మెల్సీలు భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, దువ్వారపు రామారావు, పరుచూరి అశోక్ బాబులు పాల్గొన్నారు.

## లక్ష మెట్రిక్ టన్నుల చెత్త తొలగింపుకు చర్యలు తీసుకోండి-కలెక్టరు

**నంద్యాల, మార్చి 17,ప్రభాతవార్తప్రతినిధి**
100సంవత్సరాలు చరిక్రత కలిగిన నంద్యాల మున్సుపాల్టిలో పేరుకుపోయిన లక్ష మెట్రిక్ టన్నుల చెత్త తొలగింపుకు పటిష్ట ప్రణాళిక రూపొందించుకుని పరిశుభ్రంగా చేసేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టరు జి.రాజకుమారి మున్సుపల్ కమీషనరు జిల్లా అధికారులనుఅదేశించారు. ప్రజల నుండి మున్సుపాలి ్లఓ పేరుకు పోయిన చెత్త గురించి కుప్పలు తెప్పలుగా అర్జిలు అందించాయని వెంటనే లక్షమెట్రిక్ టన్నుల చెత్తను తొలగింపుకు కార్యాచరణ ప్రణాళిక తయారు చేయాలని అదేశించారు. నంద్యాల మున్సుపాల్టి దంప్ యార్డులో పేరుకు పోయిన లక్ష మెట్రిక్ టన్నుల చెత్త తొలగింపునకు మునుప్సపల్ అదికారులతో పాటు జిల్లా అదికారులందరూ బాగస్వామ్యములై ప్రత్యేక శ్రద్ద తీసుకోవాల్సిన అవసరము ఉందన్నారు. నంద్యాల మున్సుపాల్టి పరిదిలోఉన్న 17 ఎకరాల్లో డంపింగ్ యార్డు లో సుమారుగా 90 వేల మెట్రిక్ టన్నుల చెత్త ఉందని అందులో 6 ఎకరాల్లో ఉన్న చెత్త రిక్లేమెషన (బయోమైనింగ్) చేసి ఖాళీ భూమిగా ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవడము జరిగిందని అయితే ప్రాసెస్ చేసి వాటిని అక్కడి నుంచి తొలగించలేదన్నారు. ఇంకా 10ఎకరాల్లోఉన్న చెత్తను రిక్లేమేషన్ ద్వారా మొత్తం తొలగించి పచ్చదనములో ఖాళీ ప్రదేశంగా తీర్చిదిద్దాలన్నారు. 1889లో నంద్యాల మున్సుపాల్టిగా అవిర్భావించినప్పటి నుండి పేరుకుపోయిన లక్ష మెట్రిక్ టన్నుల చెత్త తొలగింపు కార్యక్రమాన్ని అతిపెద్ద సవాల్ గే తీసుకుని విజయవంతము చేసేందుకు అదికారులందరూ సమాయత్తం కావాలన్నారు. ఈ అంశముపై పిజిఅర్‌యస్‌లోఅర్టిసి డ్రైవర్లు ప్రజల నుండి ఎన్నో మార్లు పిర్యాదులు రావడము జరిగిందని ఈ సమస్యను పరిస్కరిస్తే నంద్యాల ప్రజల మదిలో జిల్లా యంత్రాంగము ఎప్పటికి గుర్తు పెట్టుకునే అవకాశము ఉంటువదని కలెక్టరు అదికారుకు సూచించారు. అదివారము కర్నూలులో జరిగిన పరిషత్ సర్వసభ్య సమావేశములో ప్రజాప్రతినిదులు లెవనెత్తిన అ ంశాలను త్వరితగతిన పరిస్కరించాలని కలెక్టరు సంబందిత అదికారులను అదేశించారు.గోస్పాడు మండలంలోని కులూరు ,తేళ్లపేరి గ్రామాల్లో త్రాగు నీటి అంశాన్ని ఫీల్డు విజిట చేసి పరిష్కరించాలని అర్‌డబ్ల్యుయస్ అదికారులను, యంపిడిఓలను కలెక్టరు



అదేశించారు. సంగమేశ్వరం వద్ద కృష్ణానదిలో అనుమతులు లేకుండా నదిలోకి బోట్లు ప్రవేశించకుండా చర్యలు తీసుకోవాలని అత్మకూరు అర్డిఓరు అదేశించారు. కొత్తపల్లి మండల పరిదిలో హేవీలోడ్ వాఇహనాలు తిరుగుతున్న నేపద్యములో సంబందిత నివేదికలు ఇవ్వాలని కలెక్టరు అదేశించారు. మైనరు ఇరిగేషన్ ట్యాంకుల కింద ఉన్న భూముల అయకుట్ట వివరాలను బోర్డుఉ ఏర్పాటు చేసి ప్రదర్శించాలనికలెక్టరు అదేశించారు.

## ఆదోనిలో సినీ హీరోయిన్ సందడి..

**ఆదోని మార్చి 17 ప్రభాతవార్త :**



ఆదోని పట్టణంలో చందన షాపింగ్ మాల్ ప్రారంభోత్సవానికి సినీ హీరోయిన్ రీతు వర్మ రావడంతో సినీ సందడి నెలకొంది ప్రారంభోత్సవానికి సినీ రన్ రీతు వర్మతో పాటు మున్సిపల్ చైర్మన్ శాంతా టిడిపి సీనియర్ నాయకుడు ఉమాపతి నాయుడు జనసేన ఇంచార్జి మల్లప్ప వచ్చారు ఆమెను చూసేందుకు అభి మానులు అధిక సంఖ్యలో వచ్చారు. అనంతరం చందన షాపింగ్ మాల్ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మా ఊరి శ్రీనివాస్ రావు మా ఊరి వెంకట్ సంతోష్ రామ్మోహన్ మా ఊరి వెంకట గణేష్ తదితరులు పాల్గొన్నారు

## సమస్యాత్మక రహదారిని పరిశీలించిన ఎస్సై..



**మిడుతూరు మార్చి 17 ప్రభాతవార్త:**
మండలంలోని చింతలపల్లి, కాజీపేట గ్రామాల మధ్య ఉన్న దర్గా వద్ద సమస్యాత్మక పొలం రహదారి ని ఎస్సై ఓబులేసు, రైతులు పరిశీలించారు. దర్గా సమీపంలో 149 సర్వే నెంబరు లోని పొలం నుండి దేవనూరు గ్రామం వైపు చుక్కల రహదారి ఉంది. అయితే ఆ రహదారిని ప్రస్తుతము వాడుకలో లేదు. దీని పక్కన ఉన్న మరో రహదారిని అందరూ ఉపయోగించుకుంటున్నారు. అయితే కొందరు 149 సర్వే నెంబర్ లోనే చుక్కల రహదారి ప్రకారం వాడుకునేందుకు అవకాశం ఇవ్వాలని రెవెన్యూ, పోలీసు శాఖను ఆశ్రయించారు. అయితే 149 సర్వే నంబర్ లోని రైతులు ఈ ప్రతిపాదనను అభ్యంతరం వ్యక్తం చేస్తూ 149 సర్వే నంబర్ లోని పొలంలో మాత్రమే కాకుండా ఇక్కడ నుండి దేవనూరు వరకు చుక్కల భూమి రహదారిని గుర్తించి సర్వే చేయించి పూర్తిస్థాయిలో రహదారి ఉపయోగం లోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీంతో ఇరువురి రైతుల మధ్య సమస్య మొదలు కావడంతో ఎస్సై, వీఆర్వో, సర్వేరు అందరూ కలిసి సమస్యాత్మక ప్రాంతాన్ని వెళ్లి పరిశీలించారు. ఈ సమస్యపై ఎస్ఐ మాట్లాడుతూ ఇరువురు రైతులు సాయంత్రం పోలీస్ స్టేషన్ కు రావాలని అక్కడ ఈ సమస్యపై సామరస్యంగా అందరూ చర్చించుకుని అందరికీ ఆమోదయోగ్యమైన ఒక నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉందని సూచించారు.

## పదవతరగతి విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలి

– పదోతరగతి విద్యార్థులకు ఆల్‌ది బెస్ట్
– జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి.ఫిరోజ్

**నంద్యాల, మార్చి 17, ప్రభాతవార్త ప్రతినిధి**
రాష్ట్రంలో సోమవారం నుంచి ఏప్రిల్ 1వరకు పదవ తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు నంద్యాల జిల్లా టిడిపి ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి.ఫిరోజ్ ఆల్‌ది బెస్ట్ తెలిపారు. ఈమేరకు సోమవారం నంద్యాలలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఫిరోజ్ మాట్లాడుతూ పదవతరగతి విద్యార్థులు పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించి నంద్యాలకు పేరుతేవాలని ఆకాంక్షించారు. విద్యార్థులు నియమ నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని సూచించారు. సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలన్నారు. సమయాన్ని వృధా చేయకుండ ఇచ్చిన వ్యవధిలో పరీక్ష పూర్తి చేయాలని ఎన్ఎండి.ఫిరోజ్ విద్యార్థులకు సలహా ఇచ్చారు.

## సుబ్బారెడ్డిని పరామర్శించిన బీసీ రాజారెడ్డి



**బనగానపల్లె, మార్చి17, ప్రభాతవార్త:** బనగానపల్లె పట్టణానికి చెందిన నొస్సం పెద్ద వెంకటసుబ్బారెడ్డిని బనగానపల్లె గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి పరామర్శించారు. ఇటీవలే సుబ్బారెడ్డి బెంగుళూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో బైపాస్ సర్జరీ చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న బీసీ రాజారెడ్డి సోమవారం సాయంత్రం కరెంట్ ఆఫీస్ ఏరియాలోని సుబ్బారెడ్డి ఇంటి వద్దకు వెళ్లి ఆయనను పరామర్శించారు. క్షేమ సమాచారం తెలుసుకుని ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో గాలి మద్దిలేటిరెడ్డి, బొబ్బల మద్దిలేటిరెడ్డి, ఎన్.సి.సుబ్బారెడ్డి తదితరులు ఉన్నారు.

## ఆరోగ్యశ్రీ పేరుతో.. దోపిడి

: ఆరోగ్యశ్రీ కో-ఆర్డినేటర్‌పై విచారణ చేయాలి

**కర్నూలు హాస్పిటల్, మార్చి 17, ప్రభాతవార్త:**
కర్నూలు జిల్లాలో ఆరోగ్యశ్రీకి సంబంధించిన హాస్పిటల్స్ నుండి బెడ్ స్ట్రెంత్ బట్టి మరియు ఆరోగ్య సక్రమంగా నడవడం లేదంటూ అవినీతికి పాల్పడుతున్నారంటూ ప్రతినెల రూ.15 వేల నుండి రూ.50 వేల వరకు డబ్బులు ఆరోగ్యశ్రీ కో ఆర్డినేటర్‌కు ఇవ్వడం జరుగుతుంది. ఆరోగ్యశ్రీకి సంబంధించిన పేషెంట్ వద్ద ఆసుపత్రి వారు డబు ్బలు వసూలు చేస్తున్నారు. తక్షణమే ఆరోగ్యశ్రీ జిల్లా కో-ఆర్డినేటర్ మీద విచారణ జరిపించాలని డెమోక్రటిక్ స్టూడెంట్స్ (డిఎస్ఎఫ్) విన్నవించారు.